

రెండువందల ఏళ్ళకు పైబడిన పూర్వబెంగాలులో ఢాకా ఒక ప్రముఖనగరంగా ఉండేది. ఈనాటి కలకత్తా ఆనాడొక పల్లెలాగా ఉండేది.

ఒకనాటి ఉదయం గంగారాముడి తల్లికి ప్రాణంమీది కొచ్చింది. అతను ఒక గొందివెంబడి వైద్యుడికోసం ఆదుర్దాగా పోతున్నాడు. గొందికి అడ్డంగా ఒక ఫకీరు పడుకునున్నాడు. ముసల్మాను ఫకీర్లంటే హిందువులకూ, ముసల్మానులకూ గౌరవం ఉండేది; గౌరవంలేనివాళ్ళకు కనీసం భయమైనా ఉండేది. ఎందుకంటే, అక్బరుపాదుషాకు ముసల్మాను మతంగురించి పెద్ద పట్టింపు లేకపోయినా, ఫకీర్లంటే భక్తిగా ఉండేవాడు.

తన దారి కడ్డంగా పడుకునిఉన్న ఫకీరును దారి ఇవ్వమని గంగారాం ఎంతో బతిమాలాడు, సలాములు చేశాడు. కాని ఫకీరు కదలలేదు. అవతల తల్లిప్రాణం అటో ఇటో అన్నట్టున్నదన్న ఆదుర్దాలో గంగారాం సాహసించి ఫకీరుమీదుగా అంగవేసి దాటాడు. అలా దాటటంలో గంగారాంకాలు ఫకీరుకు తగలనే తగిలింది.

గంగారాం జరిగినదానికి నొచ్చుకుంటూనే వైద్యు డింటికి వెళ్ళాడు. ఫకీరు లేచి, గంగారాంపైన ఫిర్యాదు చేయడానికి కాజీవద్దకు వెళ్ళిపోయాడు.

వైద్యుడు వచ్చి గంగారాంతల్లిని పరీక్షించి, మంచినక్షత్రమో, చెడ్డనక్షత్రమో పంచాంగం చూడమని సలహా ఇచ్చాడు. గంగారాం పంచాంగం చూసి, తల్లిని తులసీ వనంలో భూశయనం చేశాడు. నారాయణశబ్దం వింటూ ఆమె కన్ను మూసింది. గంగారాం ఇరుగుపొరుగువాళ్ళ సహాయంతో తల్లికి సంస్కారం చేశాడు.

ఆ అపరాహ్ణం గంగారాం తన చెల్లెలు శ్రీని వెంటబెట్టుకుని పొరుగువాళ్ళింటికి పోతుండగా ఇద్దరు సిపాయిలు వచ్చి అతన్ని పట్టుకున్నారు శ్రీ పారిపోయింది. వాళ్ళతన్ని తిట్టుతూ, తన్నుతూ తీసుకుపోయి కాజీముందు నిలబెట్టారు.

ఫకీరు అక్కడే ఉన్నాడు. గంగారాంపైన అభియోగం తేవటమూ, విచారించటమూ, తీర్పు చెప్పటమూ అన్నీ ఫకీరే చేశాడు. అసలు కాజీ తన అధికారాలన్నిటినీ ఫకీరుకు ఇచ్చేసి చేతులుకట్టుకు నిలబడ్డాడు. చిట్టచివర కాయన గంగారామును ప్రాణాలతో సమాధి చేసివెయ్యవలసిందిగా శిక్ష చెప్పాడు.

నిండా మునిగినవాడికి చావేమిటని గంగారాము ఫకీరుముఖంమీద కాలిసత్తువకొద్దీ తన్ని, వాడినోట మిగిలిఉన్న నాలుగైదుపళ్ళూ రాల్చేశాడు. గంగారాం కాళ్ళకూ, చేతులకూ సంకెళ్ళు తగిలించి, అతన్ని తన్నుతూ, తిట్టుతూ సిపాయిలు చెరసాలకు తీసుకుపోయారు.

సాయంకాలమయింది.

మర్నాడు తన అన్నను ప్రాణాలతోనే పాతేస్తున్నారన్న విషయం శ్రీకి తెలిసింది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టుగా, తల్లికోసం ఏడ్చే శ్రీ ఈ వార్త



విని, ఏదో నిశ్చయించుకున్నది. ఆమెకు ఇరవై అయిదే ళ్ళుంటాయి. గంగారాంకన్న కొద్దిగా చిన్నది. తల్లికి జబ్బుగా ఉండటంచేత శ్రీయే ఇంటి యాజమాన్యం నిర్వహిస్తున్నది. ఆమెకు వివాహ మయిందిగాని, విధివశాన భర్తకు దూరమయింది.

శ్రీ తమఇంట పూజచేసే సాలగ్రామానికి దణ్ణం పెట్టుకుని, తన ప్రయత్నం సఫలం చెయ్యమని శ్రీమన్నారాయణుణ్ణి ప్రార్థించి, తన తల్లికి స్నేహితురాలైన పొరుగింటి ముసలిదానిదగ్గిరికి వెళ్ళింది. వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుకుని, చీకటిలో బయలుదేరి, చాలాదూరం నడిచి, పూరిగుడిసెలు చాలా దాటి, చివర కొక పెద్ద భవంతిని చేరుకున్నారు.

ముసలిది అక్కడి ఒక బంట్రోతును పిలిచి, "నాయనా, ఈ ఇంటిసామాను కొట్టు అధికారి నొకసారి పిలుస్తావా ?" అన్నది.

బంట్రోతు వెళ్ళి జీవను డనేవాణ్ణి పిలుచుకువచ్చాడు.

"ఆమె ఏదో ఇస్తుందట. అది తీసుకుపోయి, మీ యజమాని కిచ్చి, ఆయన ఏమంటారో వచ్చి చెపుతావా," అన్నది ముసలిది, జీవనుడితో.

శ్రీ తన రొండినుంచి ఒక మొహరీ తీసి, ముసలిదానిచేత జీవనుడి కిప్పించింది. జీవనుడు దాన్ని తీసుకొని లోపలికి పోతూ దీపపువెలుగులో చూసుకుని, అది మొహరీ

అని తెలుసుకున్నాడు. అది మామూలు మొహరీకాదు; దానిపైన త్రిశూలం ఉన్నది. అతను దాన్ని తీసుకుపోయి తన యజమాని కిచ్చి, "ఇది తెచ్చిన మనిషి బయట వేచిఉన్నది." అన్నాడు.

ఆ యజమాని పేరు సీతారాం. ముప్పై ఏళ్ళవాడు, అందమైనవాడు. అతను జీవను డిచ్చిన మొహరీని మూడు నాలుగుసార్లు అటూ ఇటూ తిప్పిచూసి, "దీన్ని తెచ్చిన మనిషినిమాత్రం తీసుకురా." అన్నాడు.

శ్రీ వచ్చి వాకిలివద్ద నిలబడింది. ఆమె వణుకుతూ తన మేలిముసుగు సవరించుకున్నది.

"నా పేరు సీతారాం. నువ్వెవరివి? ముసుగుచాటున నీ మొహం తెలియటం లేదు. నువు మాట్లాడకుండా ఉన్నావు. నిన్నెలా గుర్తించటం?" అన్నా డతను.

ఆమె తన మేలిముసుగు తీసేసి, కన్నీటితో తడిసిన తన ముఖం చూపించింది.

"శ్రీ వా? ఇంతకాలానికి వచ్చావా? ఏం ఏడుస్తున్నావు?"

ఆమె ఏడుస్తూ అలాగే నిలబడింది.

"దగ్గరగా రా."

"నాకు మైల."

"ఏం?"

"ఇవాళ మా అమ్మ పోయింది."

"ఆ కష్టంలో నాకోసం వచ్చావా?"

"కాదు. మా అమ్మ సంస్కారం ఎలాగో జరిపేశాం. ఇంకో పెద్ద కష్టం వచ్చిపడింది."

"ఏమి టది?"

"మా అన్నను చంపేస్తున్నారు. అతన్ని ప్రాణాలతో పాతిపెట్టాలని శిక్ష విధించి చెరసాలలో పెట్టారు."

"ఏం? అత నేం చేశాడు?"

శ్రీ తాను చూసిందీ, విన్నదీ చెప్పింది.

అంతా విని సీతారాం ఒక నిట్టూర్పు విడిచి, "ఏమిటి దారి?" అన్నాడు.

"మీరే ఆలోచించాలి. అందుకే ఇన్నాళ్ళకు మళ్ళీ మీ ఎదుట పడ్డాను."

"కాజీ అంటే ఢిల్లీ పాదుషా నౌకరు. పాదుషాతో వైరం పెట్టుకోవటం సాధ్యమా?"

"అయితే ఉపాయమే లేదా?"

"ఎందుకు లేదూ ? నా ప్రాణా లొడ్డితే మీ అన్న ప్రాణాలు కాపాడవచ్చు."

"ఆలోచించండి. దేవు డున్నాడు; ధర్మం ఉన్నది. ఈ రెండూ అబద్ధాలు కావుగదా ! ఒక దీనుణ్ణి రక్షించడంవల్ల మీకు అశుభం జరుగుతుందా ? హిందువుణ్ణి హిందువుడు కాపాడకపోతే మరెవరు కాపాడతారు ?"

సీతారాం కొంచెంసేపు యోచించి. "నువ్వన్నది నిజం. హిందువుణ్ణి హిందువుడు కాపాడకపోతే మరెవడు కాపాడతాడూ ? గంగారామునకు నా చాతనైనంత సహాయం చేస్తాను." అన్నాడు.

స్త్రీ మేలిముసుగు వేసుకుని వెళ్ళిపోయింది

రాత్రి పది గంటలవేళ సీతారాం జీవనుణ్ణి పంపి. మృణ్మయు డనేవాణ్ణి పిలిపించాడు. మృణ్మయుడు సీతారాంకు దగ్గిర బంధువైన జ్ఞాతి; అతని అనుచరుడు కూడా. అతను అమిత బలాఢ్యుడూ, సాహసీనూ.

"ఎందుకు రమ్మన్నారట ?" అని అతను సీతారాము నడిగాడు.

"ఇంట్లో ఉండే ఆడవాళ్ళనూ, పిల్లల్నీ ఎక్కడికైనా తీసుకుపోవాలి."

సీతారాం చెప్పదలచిన దంతా మృణ్మయుడికి చెప్పి అంతఃపురంలోకి వెళ్ళాడు. అంతఃపురం మండువాలో పరివారానికి చెందిన స్త్రీలూ, పిల్లలూ రకరకాల పనులలో నిమగ్నులై ఉన్నారు. అత నక్కడ ఆగి. "మీ రెవరన్నా గంగాస్నానానికి పోతారా ?" అని అడిగాడు.

అందరూ ఎక్కడిపను లక్కడ వదిలేసి, "పోతాం. పోతాం." అంటూ సమాధానం చెప్పారు

"అయితే వెంటనే బయలుదేరండి. వ్యవధిలేదు. భోజనాలు కాగానే బయలుదేరటానికి సిద్ధపడండి." అనిచెప్పి సీతారాం తన పెద్దభార్యవద్దకు వెళ్ళాడు.

అతనికి ఇద్దరు భార్యలు. వారిపేర్లు నందా, రమా. వారిని అందరూ రుక్మిణీ సత్యభామ లని పిలుస్తూండేవారు.

నంద తన భర్తను చూస్తూనే, "గంగాస్నానానికింత అఘాట్టుగా బయలుదేరటం దేనికో ?" అన్నది.

"మీ కందరికీ పుణ్యం కలిగించటం మటుకు నా విధికాదా ?"

"మీ పాదోదకం నూరు గంగలకు సమానం కాదా ? ఇంకా మళ్ళా గంగాస్నానం దేనికీ ?"

"నీ కిష్టం లేకపోతే మానెయ్యి. యిష్టమున్నవాళ్ళే పోతారు."

"అందరూ వెళ్ళినా నేనుమాత్రం పోను ఇంతకూ అసలుసంగతి చెప్పండి. ఎందు కీ రహస్యం ?"

"చెప్పే మాటైతే చెప్పేఉందునుగా ?"

సీతారాం రమవద్దకు వెళ్ళాడు.

రమ నిలువుటద్దంముందు నిలబడి జుట్టు దువ్వుకుంటున్నది. ఆమె వయసు లోనూ, ఆకారంలోనూ కూడా చిన్నది.

"గంగాస్నానంవార్త విన్నావా ?" అని సీతారాం రమను అడిగాడు

"వినకేం ?" అన్నది రమ

"బయలుదేరుతున్నావా ?"

"మీరు ?"

"నేను బయలుదేరుతున్నాను"

"అయితే నేనూ బయలుదేరుతున్నాను"

"నేనివ్వాళ బయలుదేరటం లేదు రేపు బయలుదేరి దారిలో మిమ్మల్ని కలుసుకుంటాను"

"మమ్మల్ని ఇవ్వాళ ఎవరు వెంటపెట్టుకుపోతారు ?"

"మృణ్మయుడు."

"మీకు వేరేపని ఉన్నదా ?"

"ప్రతిదీ చెప్పవచ్చునా ?"

## 2

చంద్రచూడతర్కాలంకారుడు సీతారాంకు గురువు

సీతారాం ఇంటినుంచి బయలుదేరి తన గురువుగారింటికి వచ్చి చాలాసేపు రహస్యంగా మాట్లాడాడు. చివర కతను, "శ్రీకి మాట ఇచ్చాను రక్తపాతం నాకిష్టంలేదు అందుకే మృణ్మయుణ్ణి పంపేశాను మీ ఆశీర్వాదంతో ఈ పని నెరవేరాలి," అన్నాడు

"నా ఆశీర్వాదం నీ కెప్పుడూ ఉండనే ఉన్నది శుభమస్తు। ఈ రాత్రే కాజీ దగ్గిరికి పోతావా," అని చంద్రచూడు డడిగాడు

"లేదు రే పుదయం వీలుచూసుకుని పోతాను"

సీతారాంకు రక్తపాతం ఇష్టం లేదన్నది వొట్టితొస్సుమాట ఆ సంగతి గురువుకు తెలుసు అతని బాహుబలం ఏపాటి ఉన్నదీ బయటపడే సమయం వచ్చింది కాక పోయినా హిందువు లీ అత్యాచారా లెంతకాలం సహించేటట్టు ?



"నీ శుభంకోరి ఒక చిన్న యజ్ఞంచేస్తాను. వెయ్యి రూపాయలు కావాలి. మనిషి సహాయం కావాలి. సహాయానికి మీ జీవనుడు చాలు. వెయ్యి రూపాయలు పంపమని మీ ఖజానాదారుకు పత్రం రాయి. మా నౌకరు రామసేవకుడు వెళ్ళి, డబ్బు తీసుకుని, జీవనుణ్ణి వెంటబెట్టుకువస్తాడు." అన్నాడు చంద్రచూడుడు.

సీతారాం ఒక ఆకుమీద తన కోశాధికారికి వెయ్యిరూపాయలు వెంటనే పంపమని రాశాడు చంద్రచూడుడు దాన్ని రామసేవకుడి కిచ్చి పంపి. "ఇక నువు వెళ్ళు! శుభమస్తు!" అని సీతారాంను ఆశీర్వదించాడు

సీతారాం వెళ్ళిపోయిన కొంతసేపటికి జీవనుడు వెయ్యిరూపాయలతో సహా వచ్చాడు.

"మీ యజమాని తాలూకు మనుషుల ఇళ్ళన్నీ నీకు తెలుసా?" అని చంద్రచూడుడు జీవనుణ్ణి అడిగాడు

తెలుసు నన్నాడు జీవనుడు

"అయితే నా కా యిళ్ళన్నీ చూపించు," అన్నాడు చంద్రచూడుడు

"ఈ వేళగాని వేళ చండాలుల ఇళ్ళకు పోతారా?"

"పిచ్చి ప్రశ్నలు వెయ్యక, నేను చెప్పినట్టు చెయ్యి."

"చిత్తం"

చంద్రచూడుడు తన పూజా గృహంనుంచి ఒక తట్టెడు పూలు తీసుకుని. డబ్బు జీవనుణ్ణి పట్టుకోమని ఇంటినుంచి బయలుదేరాడు కొంతదూరం వెళ్ళాక జీవను

ఠొక ఇల్లు చూపాడు. ఆ ఇల్లు యుధిష్ఠిరమండలు డనేవాడిది. జీవనుడు కేక పెట్టే సరికి వాడు బయటికి వచ్చాడు.

"ఒరే, రేపు గంగారాంను ప్రాణాలతో పాతిపెడుతున్నారు. విన్నావా?" అని చంద్రచూడు డడిగాడు.

"తెలుసు, బాబూ."

"మరి నువు వెళ్ళి చూడవూ?"

"చూసి ఏంచెయ్యాలి బాబూ!"

"లక్ష్మీనారాయణుల ఆజ్ఞ అయింది, వెళ్ళి చూడరా. ఇదుగో ప్రసాదం," అంటూ చంద్రచూడుడు వాడిచేతిలో ఒక పువ్వుపెట్టి, "ఆయుధాలేమైనా ఉన్నాయా?" అని అడిగాడు.

"ఏవో కత్తి, కైజారూ, బల్లెమూ — ఇలాటి వున్నాయి బాబూ."

"వాటిని తీసుకుపో. ఇదుగో లక్ష్మీనారాయణుల ప్రసాదం." అని చంద్రచూడుడు జీవనుడి వద్దనున్న సంచీలోనుంచి ఒకరూపాయి తీసి వాడిచేతిలో పెట్టాడు.

"అయితే బాబూ, నే నొక్కణ్ణే పోవాలా?"

"ఇంకెవర్ని తీసుకుపోతావు?"

"నా గుంపులో బలధైర్యాలు గలవాళ్ళు చాలామంది ఉన్నారు బాబూ, అందరూ వస్తారు."

"ఎంతమంది ఉంటే అంతమందినీ తీసుకుపో." అంటూ చంద్రచూడుడు మరి కొన్ని పూలూ, రూపాయలూ వాడిచేతిలో పెట్టాడు.

రాత్రి మూడోజాము గడిచేసరికి లక్ష్మీనారాయణుల ప్రసాదం అంతా చెల్లుబడి అయిపోయింది ...

గంగారాంను సజీవసమాధి చెయ్యటానికి ఊరిబయట మైదానంలో ఒకగొయ్యి తవ్వారు. ఇంకా చీకటి ఉండగానే జనం ఆ మైదానానికి వచ్చి చేర నారంభించారు. సూర్యోదయంవేళకు మైదానమంతా కిటకిటలాడే జనంతో నిండిపోయింది. ఇంకా జనం వస్తూనేఉన్నారు. కింద నిలబడటానికి చోటులేక కొందరు చెట్లెక్కారు; మరి కొందరు ఏడంగా ఉన్న మేడలమీదా మిద్దెలమీదా ఎక్కారు.

అవసరం గుర్తించి చంద్రచూడుడుకూడా ఒక చెట్టెక్కాడు. ఆ చెట్టు కింది కొమ్మల మీద శ్రీ నిలబడి, పై కొమ్మలను పట్టుకుని, జరిగేదంతా చూస్తున్నది

శ్రీ ని చంద్రచూడుడు వెంటవుండి తీసుకువచ్చాడు. ఆయ నామెను అదివరకే బాగా ఎరుగును.

రెండువందలమంది సిపాయిలమధ్య గంగారామును తీసుకువచ్చారు. అతనివెంట కాజీ ఉన్నాడు; ఫకీరుకూడా ఉన్నాడు.

"ఒక్క దిక్కులేనివాణ్ణి చంపటానికి రెండువందలమంది సిపాయిలు కావాలా?" అని శ్రీ ఆశ్చర్యపడింది శ్రీ కళ్ళవెంట అశ్రువులు ధారగా కారుతున్నాయి. కాని గంగారాం ధైర్యంగా ఉన్నాడు.

ఆ సమయంలో సీతారాం గుర్రం ఎక్కివస్తూ శ్రీకి కనిపించాడు. అతనివద్ద ఆయుధ మేమీలేదు. గంగారామును గోతిలోకి నెట్టబోయే సమయంలో సీతారాం "ఆగండి," అని కేక పెట్టాడు.

"కాఫర్‌ను గోతిలోకి తోసి పూడ్చండి," అని ఫకీరు తొందరపెట్టాడు. కాని కాజీ తొందరపడలేదు. సీతారాం ఆగమనటాని కేదో కారణం ఉండాలి. "ఆయన వచ్చిన దాకా ఆగుదాం," అన్నాడు కాజీ. ఫకీరు మొహం మాడ్చుకున్నాడు. గంగారాం మనసులో కాస్త ఆశ కలిగింది.

జనంమధ్యగా దారి చేసుకుంటూ సీతారాం గుర్రాన్ని కాజీదగ్గిరకి నడిపించి, ఫకీరుకూ, తరవాత కాజీకీ వినయంగా నమస్కారం చేశాడు.

"ఏం, రావుసాహెబ్ ? కులాసాగా ఉన్నారా ?" అన్నాడు కాజీ.

సీతారాం అంతకన్న వినయంగా ఎదురు కుశలప్రశ్న వేశాడు.

"ఈసమయంలో ఇలా వచ్చారేం ?" అని కాజీ అడిగాడు.

"నా జాతివాడి కీ దుర్గతి పట్టటంచూసి, తనని రక్షించమని తమర్ని కోరవచ్చాను"

"అ దెలా సాధ్యం ?"

"తమ కసాధ్య మేముంటుందీ ?"

"నేనే తీర్పు చెప్పాను. నా చెయి మించిపోయింది."

"వెయ్యి మొహరీలు జరిమానాకింద ఇచ్చుకుంటాను. అతన్ని వదలండి."

కాజీ ఫకీరుకేసి చూశాడు. ఫకీరు తల అడ్డంగా తిప్పాడు.

"కాఫర్‌ను పూడ్చకతప్పదు," అన్నాడు కాజీ సీతారాంతో.

సీతారాం రెండువేల మొహరీ లిస్తా నన్నాడు, దాన్ని అయిదువేలు చేశాడు. పదివేలు చేశాడు; అంతకన్న అతనిదగ్గిర ఇక డబ్బులేదు. దేనికీ ఫకీరు ఒప్పుకోలేదు తన కున్న సర్వస్వమూ ఇచ్చేస్తా నన్నాడు సీతారాం.

"అతనికోసం ఉన్నదంతా ఇస్తా మంటున్నారే, అతను మీ కేమవుతాడు ?" అని అడిగాడు కాజీ.

"మా మతధర్మం ప్రకారం శరణాగతుడు తమ్ముడికన్నా, కొడుకుకన్నా ఎక్కువైనవాడు." అన్నాడు సీతారాం.

"మీ మతంకన్న శ్రేష్ఠమైన మా ముసల్మాన్ మతధర్మం ప్రకారం కాఫర్లకు ప్రాణదండనతప్ప మరొక శిక్షలేదు. అందులోనూ ఈ కాఫర్ ముసల్మానుఫకీరు నవమానించాడు," అన్నాడు కాజీ.

"నేనూ కాఫర్నే. అతనికిబదులు నన్ను గోతిలో పెట్టి పూడ్చండి." అన్నాడు సీతారాం.

ఈ మాట వినగానే చుట్టూఉన్న హిందువులు చప్పట్లు కొట్టి సీతారాంను మెచ్చుకుంటూ నినాదా లిచ్చారు. కొందరు హరిభజన సాగించారు.

కాజీ కాస్త చలించి, ఫకీరుతో, "పదివేల మొహరీలు సర్కారు ఖజానాలో చేరతాయి. అవి తీసుకుని ఈ కాఫర్ను వదిలేస్తేనేం?" అన్నాడు.

"ఇద్దరినీ ఆ గోతిలో పెట్టి పూడ్చమంటాను," అన్నాడు ఫకీరు.

ఇంతవరకు మౌనంగా ఉన్న గంగారాం కాజీతో, "తమ రేమనుకుంటున్నారో నాకు తెలీదు. నాప్రాణం కాపాడటానికి మరొకరిప్రాణం బలిచెయ్యటం అన్యాయం అంతకన్న ఈ సంకెళ్ళతో తల పగలగొట్టకుని చస్తాను," అన్నాడు.

"ముసల్మానులను ప్రాణభిక్ష వేడేకన్న తల పగలగొట్టుకు చావడమే మేలు," అని జనంలోనుంచి ఎవరో అరిచారు.

"ఆ మాట అన్నవాణ్ణి పట్టుకోండి," అని ఒక జమేదారు కేక పెట్టాడు

ఆ అరచినవాడు మరెవరోకాదు, చంద్రచూడతర్కాలంకారుడే. కాని అతను ఎవరికీ దొరకలేదు.

ఫకీరు గాభరా పడ్డాడు కాఫర్వాణ్ణి ప్రాణాలతో పూడ్చిపెట్టటం చూడాలని అతడి అభిలాష. ఈ కాఫర్ సంకెళ్ళతో తల పగలగొట్టుకు చస్తే ఆ అభిలాష తీరదు. అందుచేత ఫకీరు కాజీని పిలిచి, "ఆ మనిషి కింకా సంకెళ్ళెందుకు? తీసేయించు." అన్నాడు.

సంకెళ్ళు తీసే కమ్మరి అక్కడే ఉన్నాడు. కాజీ ఆ కమ్మరిని పిలిచి, గంగారాం చేతి సంకెళ్ళు ఊడదీసి భద్రం చేశాడు.

"ఇంకేమిటి చూస్తారు? కాఫర్ను గోతిలో పడేసి పూడ్చండి," అన్నాడు ఫకీరు.

కమ్మరి అడ్డంపడి, "కాళ్ళసంకెళ్ళుకూడా తీసుకోనివ్వండి. సర్కారుసొమ్ము. దుర్మార్గులు జాస్తయిపోతున్నారు. మంచి లోహం చూడబోతే దొరక్కుండా ఉంది," అంటూ, కాజీ అనుమతితో గంగారాం కాళ్ళ సంకెళ్ళుకూడా ఊడదీశాడు.

మరుక్షణం, మెరుపులాగా గంగారాం సీతారాం చేతిలోని కమ్చీ లాగేసుకుని, చప్పున అతని గుర్రంమీద ఎక్కి, కమ్చీతో ఒక్కదెబ్బ కొట్టాడు. ఆ దెబ్బ తింటూనే గుర్రం ఒక్క దూకున గోతిని దాటి జనంలో పడి శరవేగంతో పరిగెత్త సాగింది.

"పట్టుకోండి. పట్టుకోండి." అంటూ సిపాయిలు వెంటపడ్డారు. కాని ప్రయోజనం లేకపోయింది. గుర్రానికి భయపడి దారిఇచ్చినవాళ్ళు సిపాయిలకంత త్వరగా దారి ఇవ్వలేదు. అంతేగాక, సిపాయిలు ముందుకు పోతున్నకొద్దీ వారి దారికి బలాఢ్యులూ, ఆయుధాలు ధరించినవారూ అయిన హిందువులు అడ్డంగా నిలబడి దారి ఇవ్వలేదు. హిందువులకూ, ముసల్మానులకూ మధ్య కొట్లాట ఆరంభ మయింది.

కాజీ కోపంగా సీతారాంను చూసి, "ఇ దేంపని?" అని అడిగాడు.

"నా కేం తెలుసు ?" అన్నాడు సీతారాం.

"ఇది నీ పనిగాక ఇం కెవరిది ? ఆ కాఫర్ బదులు నిన్ను గోతిలో పూడ్చ మన్నావుగా; అలాగే చేస్తాం," అంటూ కాజీ కమ్మరిని పిలిచి, "ఇతని కాళ్ళకూ, చేతులకూ సంకెళ్ళు తగిలించు," అన్నాడు.

మరికొంతమంది సిపాయిలను పంపమని ఫౌజ్‌దార్ వద్దకు కబురు వెళ్ళింది.

కమ్మరి వచ్చి సీతారాంను పట్టుకోవటం చెట్టుమీద ఉన్న శ్రీ చూసింది. ఆమె చెట్టుమీదనే ఉండి, ఒకచేత పైకొమ్మ పట్టుకుని, రెండోచేత్తో చీరకొంగు గిర గిరా తిప్పుతూ, "చంపండి : చంపండి ! శత్రువులను చంపండి !" అని కేకలు పెట్టింది. అందరూ ఆమెకేసి చూశారు. వారి కళ్ళ కామె మూర్తీభవించిన దుర్గ లాగా కనిపించింది. ఆ క్షణంలో ఆమెకు సిగ్గూ, భయమూకూడా లేవు; "చంపండి! చంపండి !" అని అరుస్తున్నది.

హిందువులలో ఆవేశం వచ్చింది "చండికకు జై !" అంటూ వారు ముసల్మానుల వినాశనానికి తలపడ్డారు. చూస్తుండగానే అక్కడి జనంలో హిందువులంతా ఒక పక్కకూ, ముసల్మానులంతా ఇంకో పక్కకూ వచ్చేశారు, ఉభయ పక్షాలకూ యుద్ధం ప్రారంభ మయింది. త్వరలోనే ముసల్మానులు హిందువుల దెబ్బకు తట్టుకోలేక పారిపోయారు. చివరకు మైదానం మీద ఒక ముసల్మానుకూడా లేకుండా పోయాడు.

"చంపండి, చంపండి," అన్న కేకలు వినపడ్డప్పుడే గంగారాం తన గుర్రం మీదినుంచి దిగి, ఒక మర్రిచెట్టెక్కి మైదానంలో జరిగేదంతా చూశాడు. ముసల్మా

నులు పారిపోవటమూ, ఎవడో బలాఢ్యుడు సీతారాంను తన భుజాలపైనే ఎక్కించుకుని శ్రీ ఎక్కి ఉన్న చెట్టువద్దకు రావటమూ, శ్రీ చెట్టుపైనుంచి స్పృహతప్పి కింద పడిపోవటమూ చూసి, గంగారాంకూడా తా నెక్కిన చెట్టుపైనుంచి కిందికి దూకాడు.

ఫౌజ్‌దారు సిపాయిలను తుపాకులతోనూ, తూటాలతోనూ పంపుతున్నాడని పుకారు పుట్టింది. మైదానంలో మిగిలిఉన్న హిందువులందరూ క్షణంలో మాయమై పోయారు.

చెట్టుకింద సీతారాం, మూర్ఛపడివున్న శ్రీ, ఆమెను ఆకులతో మంత్రిస్తున్న చంద్రచూడుడూ తప్ప మైదానంలో మరెవరూలేరు. గంగారాం అక్కడికి చేరగానే "నా గుర్రం తీసుకొని పారిపోతివే? దా న్నేం చేశావు? అమ్మేశావా?" అని సీతారాం అడిగాడు.

"లేదు. అవతల ఉంది తీసుకు రమ్మంటారా?" అని నవ్వుతూ అడిగాడు గంగారాం.

"ఆ గుర్రంమీదనే మహానది దాటి శ్యామాపురం చేరి ప్రాణాలు దక్కించుకో. మీ చెల్లెలి కేమీ భయంలేదు."

"మిమ్మల్ని విడిచి ఎలా వెళ్ళను?"

"నేను ఫౌజ్‌దారు వద్దకు పోతున్నాను. నావెంట వస్తావా?" అన్నాడు సీతారాం, కనుబొమలు ముడేసి. అదిచూసి గంగారాం మారుమాట లేకుండా వెళ్ళిపోయాడు.

శ్రీ కి స్పృహ వచ్చింది. ఆమె లేచి, ముసుగు ముఖంమీదికి తీసుకుని, అటూ ఇటూ చూసి, ఎవరితోనూ ఏమీ అనకుండా నగరంవేపు బయలుదేరింది.



సీతారాం చంద్రమూడుడితో, "మీరుకూడా దాని వెంటనే వెళ్ళి, దాన్ని కాపాడే మార్గం చూడండి." అన్నాడు.

"నువ్విక్కడ ఉండి ఏంచేస్తావు?" అని గురువు అడిగాడు.

"ఇంకా ఏదీ తేల్చుకోలేదు. మీరుకూడా శ్యామాపురానికే దయచెయ్యండి. ప్రాణాలతో వుంటే మిమ్మల్ని అక్కడ కలుసుకుంటాను."



మైదానంలో సీతారాం ఒక్కడే మిగిలాడు. అతను శ్రీ ఎక్కిన నిలబడిన కొమ్మనే పట్టుకుని నేలపై నిలిచి 'ఇదంతా ఏమిటి ? ఇలా ఎందుకు జరిగింది ? ఇది ఎవరి పని ? దీని లక్షణ మేమిటి ? మర్మ మేమిటి ?' అని తనలో తాను వితర్కించు కున్నాడు. ఈ ఘటన దైవప్రేరిత మనీ, ధర్మ సంస్థాపనకొరకే ఇది ప్రారంభ మయిందనీ, పురాణకాలంలో దేవదానవయుద్ధా లిలా జరిగినవే ననీ, విఘ్యక్త ధర్మమే దైవ మనీ, ధర్మస్థాపనకు అంకితం కానట్టయితే తన శక్తులు శక్తులే కావనీ అతనికి అనిపించింది.

అతను తృప్తి పడిన హృదయంతో తల ఎత్తి చూసేసరికి మైదానం యావత్తూ ముసల్మాను సైనికులమయంగా కనిపించింది. ఆ సైనికులు తిరుగుబాటుదార్లను పట్టుకోవటానికి వచ్చారు. కాని పట్టునునే టందు కెవరూ మైదానంమీద లేనందున సైనికులు, ఎవరిదారిన వారు వెళ్ళిపోసాగారు.

వారిలో ఒకడు సీతారాంను చూసి, "ఎవరు నువు ?" అని అడిగాడు.

"మనిషిని." అని జవాబు చెప్పాడు సీతారాం.

"నీచుడల్లే కనబడుతున్నావు."

"ఢిల్లీపాదుషా కన్నానా ?"

"ఏమన్నావ్ ? నిన్ను పట్టి బంధిస్తాను."

"బంధించు."

"చెరసాలకు నడు."

## 3

చంద్రచూడుడు శ్రీని వెంటబెట్టుకుని, ఎవరూ అడ్డగించకుండానే నగరం ప్రవే శించారు. ఆద్దరూ ఒక రహస్య మందిరంలోకి వెళ్ళారు. అక్కడ ఒక ఎనభై ఏళ్ళ వృద్ధురాలుతప్ప మరెవరూ లేరు.

చంద్రచూడు డా వృద్ధురాలిని పలకరించి, శ్రీతో, "నువ్వివాళా రేపూ ఈ ముసలామెదగ్గిర ఉండు. ఈ లోపల మీ అన్న స్వస్థుడైతే నిన్నతని దగ్గిరికి తీసుకుపోతాను. నువ్వింటికి పోయే అవకాశం లేదు. ముసల్మానుల భయం చాలా జాస్తిగా ఉంటుంది." అన్నాడు.

"అయ్యా ! ఈ ముసల్మానుల దుర్మార్గం ఇంకెంత కాలం సాగుతుం దని శాస్త్రాల్లో ఉన్నది ?" అని శ్రీ ఆయన నడిగింది.

"తల్లీ, ఇది శాస్త్రాల్లో ఉండే విషయం కాదు. హిందువుల బలంపైన ఆధార పడ్డ విషయం."



శ్రీ ఏదో నిర్ణయించుకున్నదాగానిలా ముఖంలో సంతృప్తి కనబరుస్తూ, "ఒక్క సారి మైదానానికి వెళ్ళిరావాలి," అన్నది.

"ఎందుకూ? చాలా ప్రమాదం అక్కడ సిపాయిలు కొరాడుతున్నారు"

"అక్కడ ఒక వస్తువు వదిలివచ్చాను. వెళ్ళితీరాలి. మీకు రావటానికి వీలులేకపోతే మానెయ్యండి. ఒకతెనే పోతాను. కాని మీరు కూడా వస్తే మంచిది."

"నీకున్న ధైర్యం నాకుండదా? పద, పోదాం."

శ్రీ ముందు నడిచింది, వెనకగా చంద్రచూడుడు నడిచాడు. వారు మైదానం చేరుకునేసరికి ఒక సిపాయి చంద్రచూడుణ్ణి ఆపి, "నువ్వెవరు?" అని అడిగాడు.

"నే నొక భట్టాచార్య బ్రాహ్మణ్ణి. మా యజమానిఇంట శ్రాద్ధం. అక్కడికి పోతున్నాను. న న్నేం చెయ్యమంటావు?"

"సరే నువు వెళ్ళు. ఈమె నీ కేమవుతుంది."

"ఏమీకాదు."

సిపాయి శ్రీని సమీపించి, "అమ్మా, నువ్వెవతెవో చెప్పివెళ్ళు. ఆడవాళ్ళను పట్టుకోమని మా కాజ్ఞ లేదుగాని, ఒక్క చండి అనే వితంతువుకోసం మేం వెతుకుతున్నాం," అన్నాడు.

"ఆ చెట్టుమీద నిలబడి మీకందరికీ ఆపద తెచ్చిపెట్టిన మనిషేనా?" అని శ్రీ అడిగింది.

"ఔనౌను."

"నాపేరు చండి కాదుగాని, ఆ మనిషిని నేనే."

సిపాయి వణుకుతూ, "ఏమిటీ?" అన్నాడు

"అవును నేనే ఆ మనిషిని"

"తోబా, తోబా! అలా అనకూడదమ్మా. నువ్వింటికి వెళ్ళు," అన్నాడు సిపాయి.

ఇంతలో ఇంకో సిపాయి వచ్చి మొదటివాడితో, "ఆమెను పట్టుకో," అన్నాడు.

"నాకు వేరే పని ఉన్నది. నువే పట్టుకో," అన్నాడు మొదటివాడు.

రెండో సిపాయి శ్రీని సమీపించి ఆమె వీపుమీద రెండు గుద్దులు గుద్దాడు.

శ్రీ చంద్రచూడుడికేసి తిరిగి నవ్వుతూ, "నా భర్తను మీ రెరిగివుంటే, నన్నుద్ధరించటం తన ధర్మమని ఆయనతో చెప్పండి." అన్నది.

చంద్రచూడుడి కళ్ళవెంట నీరు తిరిగింది...

హిందువులను 'చంపండి, చంపండి,' అని పురిగొల్పిన ఆడది ఒక్కతే అయినప్పటికీ ఆమె అనేకమంది సైనికులకు అనేక చోట్ల దొరికింది! ఆమె వితంతువని ఎవరో అనటంచేత సిపాయిలు చాలామంది వితంతువులనుకూడా పట్టుకున్నారు: యువ్వని అని విని అనేకమంది యౌవనవతులనూ, తల విరియ బోసుకున్న దని తల విరియబోసుకున్నవాళ్లనూ కూడా పట్టుకున్నారు. ఆ స్త్రీలందరికీ బేడీలు తగిలించి, ఫౌజుదారు ఇంటికి తీసుకుపోయారు. ఆ ఇల్లు ద్రోహులైన స్త్రీ పురుషులతో నిండిపోయింది. వారిలో సీతారాంకూడా వున్నాడు.

చీకటి పడింది. ఖైదుద్వారం వెలపల కాపలావాళ్ళు పహరా ఇస్తున్నారు. ఖైదీల కాపూట భోజనం లేదు. ఎక్కడివా ళ్ళక్కడ పైబట్టలు పరిచి పడుకున్నారు. సీతారాం ఒక్కొక్కరివద్దకూ వెళ్ళి, "పడుకోవద్దు. పడుకుంటే విడుదల కావటం కష్టం," అని చెప్పాడు.

ఆ మాట ఎవరికీ అర్థం కాలేదు. కాని అందరూ మేలుకుని కూర్చున్నారు.

రాత్రి ఒకజాము గడిచినట్టు గుర్తుగా నౌబత్ వాయింపు వినిపించింది. సీతారాం కొంతమంది ఖైదీలను చేరగట్టుకుని, "ఇంతమందిమి ఉన్నాం. వెళ్ళిపోలేమా?" అన్నాడు.

"ఎలా పోవటం?" అని ఎవరో అడిగారు.

"తలుపులు పడదోసుకుని." అన్నాడు సీతారాం.

"ఉండటానికి చాలామందిమి ఉన్నాం; కాని ఏం లాభం?"

"అయిదువందలమందిమి ఏకమై ఒకతలుపును పగలగొట్టలేమా?"

"ఏమి టనుకున్నావు? అది ఇనపతలుపు!"

"మనం మట్టి మనుషులమా? మైనం మనుషులమా?"

ఈ మాట లనేవాడు సీతారాం అని తెలియగానే వినేవాళ్ళకు ధైర్యం వచ్చింది; అతను చెప్పినట్టు చేస్తా మన్నారు

అతను వారి నందరినీ తలుపులకు ఎదురుగా బారులు తీర్చి నిలబెట్టారు. ఒక్కొక్క పంక్తిలో ముగ్గురేసి ఉన్నారు. తలుపు పగలగొట్టే ఏర్పాటేమిటంటే, మొదటి పంక్తిలో ఉన్న ముగ్గురూ ఒక్కపెట్టున, "జై లక్ష్మీనారాయణ్ !" అని తలుపును తమ బలంకొద్దీ తన్నాలి; తన్ని వెనక్కి వెళ్ళిపోవాలి. ఆ తరవాత రెండో పంక్తిలో ఉండే ముగ్గురూ ముందుకు వచ్చి అలాగే చేస్తారు. తలుపు విరిగేవరకూ ఇదే కార్యక్రమం.

ఈ కార్యక్రమం రెండోజాము గడవగానే ప్రారంభమయింది. ఖైదీలు తలుపును ధనాధనా తన్నుతూఉండటం చూసి, బయట నిద్రమత్తుతో తూలుతున్న పహరా వాళ్ళు నలుగురూ ఉలిక్కిపడ్డారు.

"ఏమిటది ?" అని ఒకడు కేకపెట్టాడు.

ఖైదీలు తలుపు పగలగొట్టాలని చూస్తున్నారు." అన్నాడొక పహరావాడు

"ఇనపతలుపులు పగలగొట్టటం బెంగాలీవాళ్ళతరమా !" అన్నాడు మరొకడు.

ఇనపతలుపు ఖైదీలకు లొంగబోదని వాళ్ళు ధైర్యంగా ఉన్నారు. తలుపు ఏచుట్టూ ఉండేగోడ లొంగివచ్చునన్నది వారికి తట్టలేదు తీరా ద్వారం చుట్టూ పెద్దపెద్ద బీటలేర్పడి, ఇనపతలుపు ద్వారబంధంతోసహా విరిగి ముందుకు పడిపోయింది.

"జై లక్ష్మీనారాయణ్ !" అని అరుస్తూ ఖైదీలందరూ బయటికి రాసాగారు పహరావాళ్ళు పారిపోయారు.

అందరూ బయటికి వచ్చాక సీతారాం ఖైదులోకి వెళ్ళి, ఇంకెవరైనా మిగిలిఉన్నారేమోనని చూశాడు. ఒక ఖైదీ నిండా ముసుగు పెట్టుకుని పడుకునిఉండటం అతనికి కనిపించింది.

"ఎవరా పడుకున్నది ? అందరూ వెళ్ళిపోయారు ? నువ్వింకా పడుకుని ఉన్నావేం ?" అని సీతారాం ఆ ఖైదీని అడిగాడు.

"ఎక్కడికి వెళ్ళాలి ?" అని ఒక స్త్రీ కంఠం ప్రశ్నించింది. గొంతు విన్నట్టుగానే ఉంది.

"ఎవరునువ్వు ?" అని సీతారాం అడిగాడు.

"శ్రీని."

"నువ్విక్కడెందుకున్నావు, శ్రీ ?"

"సిపాయిలు పట్టి తీసుకొచ్చారు."

"ఇల్లెక్కడ ?"

"మీ అమ్మగారిల్లు లేదూ ?"

''అక్కడ ఎవ రున్నారు ? న న్నెవరు చూస్తారు ?"

'అయితే ఎక్కడికి పోదామనీ?"

"ఎక్కడికీ పోను."

"నేను శ్యామాపురం పోతున్నాను. మీ అన్నకూడూ పోతాడు. నువ్వుకూడా వెళ్లు"

"అక్కడికి న న్నెవరు తీసుకుపోతారు"

సీతారాం కొంచెం ఆలోచించి, "పద, నేనే తీసుకుపోతాను." అన్నాడు.

శ్రీ లేచి కూర్చొని, "ఇన్నాళ్ళయాక ఇలా అంటున్నారేం ?" అని అడిగింది

"అదంతా చెప్పటం కష్టం. అడగకు."

"చెప్పకపోతే నేను మీవెంట రాను. విడిచిపెట్టిన మనిషివెంట ఎందుకు వెళ్ళటం ? ఎలా వెళ్ళటం ? ఉన్నట్టుండి మీకు నా పైన దయగలిగి, నా ప్రాణాలను కాపాడటానికి మీ వెంట రమ్మంటే మీ దయ నా కవసరం లేదు. మీ భార్యగా నేను మీ స్నేహానికీ, మీ సర్వస్వానికీ అధికారం గల దాన్ని. కాస్తంత దయ నా కవసరం లేదు. వద్దు మీరు వెళ్ళండి. మిమ్మల్ని విడిచి ఇంతకాలమూ లేనా ? ఇప్పుడూ ఉండగలను."

"అంతా చెబుతాను, పద."

"ఏం చెబుతారు ? నేను మీ పెద్దభార్యను, నంద రెండోది. నేను పట్టమహిషిని. నేను జారిణినా, జాతిభ్రష్టనా ? పెళ్ళి అయీ అవుతూనే నా తప్పేమిటోకూడా చెప్పకుండా న న్నెందుకు వదిలిపెట్టారు ? అది చెప్పందే నేను మీతో రాను."

''అదంతా చెబుతాను. కాని నేను చెప్పినదంతా విని, నన్ను వదిలెయ్యనని నువ్వు మాట ఇయ్యాలి."

సిపాయిల తుపాకుల చప్పుడు వినిపించింది. పారిపోయేవాళ్లను వాళ్లు తరుముతున్నట్టున్నారు. ఖైదులో ఉండటం అపాయకరమని చెప్పి సీతారాం శ్రీని వెంట బెట్టుకుని అక్కడినుంచి బయలుదేరాడు.

ఇద్దరూ నదీతీరానికి పోయి, నక్షత్రాల కాంతిలో ఇసుకతిన్నెపైన కుర్చున్నారు. అప్పుడు సీతారాం శ్రీకి జరిగిన సమాచారం చెప్పాడు.

సీతారాం పెళ్ళికి ముందుగానే ఉతని తండ్రి, తనకు కాబోయే కోడలైన శ్రీ యొక్క జాతకం చూడా లన్నాడు. కాని శ్రీకి జాతకం రాయలేదు. ఆమె నష్ట జాతకురాలు. అందుచేత సీతారాం తండ్రి పెళ్ళికి ఒప్పుకోలేదు. కాని అతని తల్లి, పిల్ల చక్కనిదని మోజు పడి, పట్టు పట్టి పెళ్ళి జరిపించింది. పెళ్ళి జరిగిన వెంటనే వారింటి కొక గొప్ప జ్యోతిష్కుడు వచ్చాడు. ఆయన నష్టజాతకాలను



వెయ్యటంలో చాలా గట్టివాడు. ఆయన శ్రీకి జాతకం వేసి, ఆమె తన ప్రియుణ్ణి హత్య చేస్తుందని జాతకరీత్యా చెప్పాడు. ఆ సంగతి వినగానే సీతారాంతండ్రి తన కోడలిని విసర్జించవలిసిందిగా ఆజ్ఞాపించాడు. జ్యోతిష్కుడు సీతారాంకు మరొకపెళ్లి చెయ్యమని సలహా ఇచ్చాడు.

సీతారాం ఈ సంగతి చెప్పి, "మా తండ్రి ఆజ్ఞకు లోబడిఉంటానని మాట ఇచ్చాను." అన్నాడు.

"ఇప్పుడు డాయన లేరుగా?" అన్నది శ్రీ.

"చనిపోయారని ఆయన ఆజ్ఞ ఉల్లంఘించనా!"

శ్రీ లేచి నిలబడింది.

"ప్రమాదం ఏర్పడితే మీ వద్దకు పంపమని ఈ మొహరీని నాకు ఒకప్పుడు పంపారు నా అన్నకు ప్రాణంమీదికి వచ్చినప్పుడు నేను దాన్ని మీ వద్దకు పంపాను నన్ను త్యజించికూడా ఇంత ఉపకారం చేసిన మీ ఔదార్యం ఎంత గొప్పది. ఇక నాకీ మొహరీతో పనిలేదు భార్యకు భర్తకన్న ప్రియు డెవడుంటాడు? నా పేరైనా ఇక మీరు వినకుండా చూస్తాను నేను మీకు నూ రామడల ఎడంలో ఉంటాను." అని చెప్పి శ్రీ తన చేతిలోని మొహరీని నదిలోకి దూరంగా విసిరి పారేసి, చీకటిలోకి నడిచి వెళ్ళిపోయింది

ఆమె సీతారాంకు మళ్లా కనిపించలేదు

4

శ్రీ వెళ్ళిపోయిన మరుక్షణమే సీతారాం, ఆమె తన కెంత సన్నిహితురాలో గ్రహించాడు. పెళ్ళి అయినప్పు డతను ఆమెను ఎక్కువ రోజులు చూడలేదు. అప్పు డామె చిన్నపిల్ల కూడానూ. ఆ దశలోనే ఆమెను త్యజించటం జరిగింది.

తన ఇల్లు విడిచిపోయిన కొంత కాలానికి ఆమె చిక్కులలో ఉన్నట్టు విని సీతారాం ఆమెవద్దకు డబ్బు పంపుతూ ఒక మొహరీకూడా పంపమనీ, ఆమె కేదైనా తీవ్రపరిస్థితి కలిగినపప్పుడు దాన్ని సంకేతంగా పంపమనీ ఆమెకు కబురు చేశాడు. ఆమె దాన్ని అతనిదగ్గిరికి చాలాకాలం పంపనేలేదు: తన అన్నకు ప్రాణాపాయం కలిగినప్పుడే పంపింది.

సీతారాం శ్రీని మరిచిపోయిన మాట నిజం. కాని అందుకు ప్రబలమైన కారణా లున్నాయి. అతనికి సన్నిహితంగా నందా, రమా ఉన్నారు. ఒకతె సుఖస్వరూపిణి, మరొకతె సంపత్స్వరూపిణి. వా రిద్దరూ చెరొకపక్కా ఉంటూండగా ఆపత్స్వరూపిణి అయిన శ్రీ ఎలా జ్ఞాపకం వస్తుంది?

కాని ఇప్పుడు అతనికి శ్రీ అత్యంత సన్నిహితురా లయింది. అందుకు కారణం ఆమె అందం కావచ్చు, దుఃఖం కావచ్చు, తా నామెకు చేసిన అన్యాయం కావచ్చు— అన్నీకూడా కావచ్చు. ఇప్పు డతని మనస్సులో తండ్రి ఆనతిలేదు. నందిలేదు. రమలేదు. శ్రీ తప్ప ఇం కెవరూలేరు. రేపు తాను సామ్రాజ్యం స్థాపించటానికి కంకణం కట్టుకున్నాడు. ఆ సామ్రాజ్యానికి పట్టమహిషి అయే హక్కు శ్రీకి తప్ప ఎవరి కున్నది? — చెట్టుపైన నిలబడి చండికలాగా హిందువులను రెచ్చగొట్టిన శ్రీకి తప్ప!

అతను తండ్రి ఆజ్ఞ ఉల్లంఘించటానికీ, అవసరమైతే అందుకు తగిన ప్రాయశ్చిత్తం అనుభవించటానికీ నిశ్చయించుకున్నాడు. అతను లేచి, శ్రీ వెళ్ళిపోయిన దిక్కుగా బయలుదేరాడు. చీకటిలో ఆమె జాడ ఎక్కడా కనిపించటంలేదు. ఆమె దూరంగా నల్లగా కనిపించే చెట్ల సమూహంకేసి వెళ్ళింది. సీతారాం వాటిలోకి ప్రవేశించిచూశాడు. శ్రీ జాడలేదు. "శ్రీ! శ్రీ!" అని గట్టిగా కేకపెట్టాడు. చెట్లు ప్రతిధ్వనించాయిగాని జవాబేమీ రాలేదు.

అతను హతాశుడైపోయాడు, కాని ఆమె శ్యామాపురానికి వెళ్ళి తన అన్నను చేరుకుంటుందేమో నన్న ఆశ తల ఎత్తింది, అతను శ్యామాపురానికి వెళ్ళాడు.

గంగారాం అక్కడికి చేరుకుని సీతారాంకొర కెదురుచూస్తున్నాడు.

"నీ చెల్లె లెక్కడ, గంగారాం?" అని సీతారాం అడిగాడు.

"నా కేం తెలుసునూ ? ఆమె వెంట మీరు చంద్రచూడుణ్ణి పంపారుగా ?" అన్నాడు గంగారాం.

"సర్వనాశన మయింది. ఆమె చంద్రచూడుడివద్ద లేదు. ఇక్కడికి రాలేదా ?"

"లేదు "

''అయితే నువ్విప్పుడే బయలుదేరివెళ్ళి ఆమెను వెతుకు భయపడకుండా అన్ని చోట్లకూ వెళ్ళు. కావలిస్తే మనుషులను పంపు ఖర్చుకుగాను డబ్బిస్తాను.''

గంగారాం కొంతడబ్బు తీసుకుని వెళ్ళి, వారం రోజులపాటు అన్నిచోట్లా గాలించి. తిరిగివచ్చి సీతారాంతో తన చెల్లెలిజాడ తెలియలేదని చెప్పాడు.

శ్యామాపురానికి దగ్గరగా అడవి మధ్య పాడుపడిన లక్ష్మీనారాయణస్వామి మందిర మొకటి ఉన్నది ఆలయం భూమిలోపల వుండి. దాని పైభాగం మాత్రమే భూమికి ఎగువగా కనిపిస్తూఉండేది. శ్యామాపురం చేరుతూనే సీతారాం ఆ దేవాలయాన్ని బాగు చేయించాడు ఆలయంచుట్టూ మట్టి తవ్వించి. లోపలికి దిగటానికి మెట్లు కట్టించాడు.

ఒకరోజు సీతారాం తనభార్య లిద్దరినీ వెంటబెట్టుకుని పల్లకీలలో ఆ ఆలయానికి వెళ్ళాడు. అతను గర్భాలయానికి వెళ్ళేసరికి, ద్వారంలో ఒక ముసల్మానువాడు కూర్చునిఉన్నాడు

సీతారాం ఆ మనిషిని చూసి, 'మీ రెవరు ?' అంటే. ఆమనిషి 'ఫకీరు' నని చెప్పాడు.

"దేవాలయంలో ముసల్మా నేమిటి ? " అన్నాడు సీతారాం

"దేవు డపవిత్రు డయాడా ? " అని ఫకీరు ఎదురుప్రశ్న వేశాడు.

"కాలేదా ? నీ కిదేం దుర్బుద్ధి ? "

"మీ దేవు డేం చేస్తాడు ? "

"సృష్టిస్థితిలయాలు."

"ముసల్మానులను సృష్టించి మీ దేవు డపవిత్రు డయాడా ? మీ దేవు డీ ఆలయం లోనే ఉంటాడా ? ఇం కెక్కడన్నా ఉంటాడా ? "

"అంతటా ఉంటాడు అతడు లేనిచోటు లేదు."

"అయితే నాలోనూ ఉన్నాడా ? ఉండి అపవిత్రుడు కాలేదా ? కేవలమూ నేను ఆలయంలో ప్రవేశిస్తే నే అపవిత్రు డయాడా ? "

సీతారాం జవాబు చెప్పలేక, "అది మా ఆచారం," అన్నాడు

"ఇటువంటి అర్థంలేని ఆచారాలను పట్టుకుని [illegible] స్థాపించగలవా ? హిందూ మహమ్మదీయుల మధ్య భేదబుద్ధితో నువు ఏర్పాటుచేసే రాజ్యం పాపరాజ్య మవుతుంది. అది నిలవదు."

"ముసల్మానులు అలాటి భేదం చూపటంలేదా ? "

"చూపిస్తున్నారేమో, వాళ్ళరాజ్యం నశించిపోతున్నది. ఇక నీ దేవుణ్ణి నువు పూజించుకో, నే నవతలికి పోతాను."

ఆ ఫకీరు గొప్ప జ్ఞాని అని సీతారాం గ్రహించాడు.

"మీరు చెప్పినది చాలా న్యాయంగా ఉన్నది. దాని ప్రకారమే నడుచుకుంటాను. మీరు మా రాజధానిలోనే ఉండి, నన్ను సరిఅయిన మార్గాన నడిపించండి." అన్నాడతను ఫకీరుతో.

"నేను చెప్పినట్టు వింటే అలాగేవుంటాను. నీ రాజధాని పే రేం పెట్టబోతున్నావు ?"

"దానికి శ్యామాపుర మని పేరదివరకే ఉన్నదిగదా. అదే ఉంచుతాను "

"మహమ్మదుపుర మని పేరు పెట్టు. అలా చేశావంటే, నువు హిందూ ముసల్మానులను ఒకే దృష్టిలో చూస్తావని నాకు నమ్మకం కలుగుతుంది "

సీతారాం కొంచెం ఆలోచించి, సరే నన్నాడు.

శ్యామాపురం ఒక గ్రామం. అది మధుమతీ నదీతీరాన ఉన్నది అది సీతారాంకు పిత్రార్జితమైనది. ఖైదునుంచి తప్పించుకుని సీతారాం ఇక్కడికి వచ్చి కాపరం పెట్టాడు సీతారాం మూలంగా ఖైదునుండి తప్పించుకున్నవా రందరూకూడా ఫౌజ్‌దారుకు భయపడి, భూషణ నగరం వదిలిపెట్టి శ్యామాపురానికే వచ్చి తలదాచుకున్నారు అదేవిధంగా సీతారాం పరివార మంతాకూడా ఇక్కడికే వచ్చేశారు

కొత్తగా వచ్చి చేరినవారికోసం ఇళ్ళు కట్టారు. గ్రామంకాస్తా నగరం కాసాగింది. నగర జీవితానికి అవసరమైన వర్తకులనూ, శిల్పులనూ, కూలీలనూ, నేతగాళ్ళనూ, తదితర వృత్తులవాళ్ళనూ సీతారాం భూషణలాటి నగరాలనుంచి పిలిపించి, వారికి నివాసాలు కట్టించిపెట్టాడు. కొత్తనగరానికి దుకాణాలూ, సంతా, ఓడరేవూ ఏర్పడ్డయి. నగరంతోబాటు అతని రాబడి పెరిగింది. సేనకూడా పెద్దదయింది. ముసల్మానుల బాధకు తట్టుకోలేక హిందూరాజ్యంలో క్షేమంగా ఉండటానికి ఎంతో దూరప్రాంతాలనుంచికూడా ప్రజలు వచ్చి చేరారు.

అతను తన కొత్తనగరానికి మహమ్మదుపుర మని పేరు పెట్టటంచేత ముసల్మాను ప్రజల దృష్టిలో మంచివాడులాగా కనబడ్డాడు. తాను తగినంత బలం సంపాదించుకునే

[illegible] ముసల్మానులను సైతం రచ్చగొట్టటం అతనికి ఇష్టంలేదు. అంతదాకా అతని కృషి చాపకింది నీరుగా ఉండవలిసిందే.

ఇంత మెళుకువగా ఉన్నప్పటికీ సీతారాంను ఫౌజ్‌దార్ తోరాబ్‌ఖాన్ అనుమాన దృష్టితోనే చూశాడు. ఏదైనా సాకు దొరికితేచాలు, మహమ్మదుపురాన్ని నాశనం చేసి సీతారాంను నామరూపాలులేకుండా చెయ్యాలనే తోరాబ్‌ఖాన్ ఆలోచన.

"మీ నగరంలో అనేకమంది విద్రోహులు తలదాచుకున్నారు. వారి నందరినీ పట్టి నాకు అప్పగించు." అని ఫౌజ్‌దార్ సీతారాంకు ఫర్మానా పంపాడు.

"విద్రోహుల జాబితా పంపినట్లయితే వారిని పట్టి మీకు అప్పగిస్తాను." అని సీతారాం జవాబు పంపాడు.

ఫౌజ్‌దార్ వద్దనుండి ఒక పెద్ద జాబితా వచ్చింది. ఈలోపుగా, పారిపోయి వచ్చినవాళ్ళంతా తమపేర్లు మార్చేసుకున్నారు.

"మీరు పంపిన పట్టికలో గల పేర్లలో ఏ ఒకటిగాని తనదని చెప్పుకునేవాడు నగరంలో కనబడటంలేదు." అని సీతారాం ఫౌజ్‌దార్‌కు తెలియజేశాడు.

ఈ ఉత్తర ప్రత్యుత్తరాలతో వారిద్దరూ ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్నారు. సీతారాంను నాశనం చెయ్యటానికి ఫౌజ్‌దార్ పెద్దసేనను తయారుచెయ్య నారంభించాడు. సీతారాం ఆత్మరక్షణార్థం మహమ్మదుపురం నాలుగుపక్కలా బలమైన ప్రాకారం నిర్మింపజేసి, ప్రజలకు యుద్ధపద్ధతులు నేర్పించి, అరణ్యమార్గాలవెంట గోప్యంగా రకరకాల ఆయుధాలు తెప్పించి పేర్చిపెట్టాడు.

ఈ పనులన్నీ సాగించటంలో అతనికి తోడ్పడ్డవారు చంద్రచూడుడూ, మృణ్మయుడూ, గంగారామూనూ. అప్పుడప్పుడూ ఫకీరు వచ్చి, మంచిచెడ్డలు చెబుతూ, అభిప్రాయభేదాలు తొలగిస్తూ, పని చురుకుగా సాగటానికి సహాయంగా వుండేవాడు.

సీతారాం విశ్వాసాలకూ, ఆశయాలకూ, కృషికీ నిజమైన వైరిఅయి కూర్చున్నది ఇతని చిన్నభార్య రమ. ఆమె చాలాపిరికిది. సీతారాం సాహసం తలుచుకున్నకొద్దీ ఆమె మరింత బెదురుగొడ్డయిపోయి, అతనికే పిరికిమందు పోయ యత్నించింది.

"వెళ్ళి ఆ ఫౌజ్‌దార్ కాళ్ళమీద పడి క్షమాపణ చెప్పుకోండి!" అని ఆమె భర్తను పీడించసాగింది. అతను వినిపించుకోలేదు. రమ మరింత వెర్రిదైపోయి, అన్నపానాలు మానేసింది. తానేమీ ముసల్మానులకు ద్రోహం చెయ్యటంలేదని భర్త చెప్పినా ఆమె నమ్మక, అహోరాత్రాలు బావురుమని ఏడవసాగింది.

సీతారాం ప్రాణాన్ని చిన్నభార్య ఇలా కొరుక్కుతింటే, పెద్దభార్య నంద మహాశోకవిధంగా అతని మనస్సును శ్రీ మీదికి మళ్ళించింది. నందకు భర్తమీద గుడ్డి నమ్మకం. అత నేది చేసినా అది సరైనదే. అతనిమాట శిలాక్షరం; అతని ఆజ్ఞ అవశ్యాచరణీయం. కాని అతని ఆలోచనలు పంచుకుని, సలహాలూ, ఉత్సాహమూ ఇచ్చేదక్షత నంద కేకోశానా లేదు. అపరచండికలాటి శ్రీయే అందుకు యోగ్యురాలు అతను తన హృదయంలో ఆమెనే ధ్యానం చేస్తున్నాడు

## 5

శ్రీ వైతరణీ నదీతీరాన నిలబడిఉన్నది దూరంగా నీలగిరి కొండలపంక్తి కనిపిస్తున్నది. నదిఒడ్డున సప్తమాతృకామండలమూ, నల్లరాతిమెట్లూ ఉన్నాయి

"ఇదేనా వైతరణి? దీన్ని దాటితేనేనా అన్నపానాలు అణగిపోయేది?" అన్నది శ్రీ తనలో తానే.

"ఇది ఆ వైతరిణికాదు దాన్ని చూడాలంటే యమలోకద్వారం దగ్గిర నిలబడాలి." అని వెనుకనుంచి ఎవరో జవాబు చెప్పారు శ్రీ వెనక్కు తిరిగి చూసేసరికి ఒక భైరవి కనిపించింది

"తల్లీ భైరవీ, యమలోకద్వారం వైతరిణికి ఈ ఒడ్డునా, ఆ ఒడ్డునా?" అని శ్రీ ఆమె నడిగింది

భైరవి నవ్వి, "అలా అడిగావేం? ఇవతలి ఒడ్డునే నీకు యమయాతన ప్రాప్తించిందా ఏం?" అన్నది.

"యాతన రెండువేపులా ఉన్నట్టే కనబడుతోంది." అన్నది శ్రీ.

"లేదమ్మా చేసిన పాపా లన్నిటినీ ఈ ఒడ్డునే విడిచిపోతే, అవతలి ఒడ్డున ఏ యాతనా ఉండదు"

"అలా అయితే వెంటనే నా బరువంతా ఇక్కడే వదిలేసి వేగంగా అవతలి ఒడ్డుకు వెళ్ళిపోతాను."

"ఎందుకంత తొందరపడుతున్నావు?" అని భైరవి అడిగింది

"ఆలస్యం చేసినకొద్దీ తుపాను లేస్తుంది"

"తుపానుకు భయపడుతున్నావు సరయిన నావికుడు లేడా?"

"సమర్థుడే ఉన్నాడు, కాని అతని నావను విసర్జించి వచ్చేశాను."

"అందుకా వైతరణిని వెతుక్కుంటూ వచ్చావు?"

"శ్రీక్షేత్రంలో మహోత్కృష్టుడైన నావికు డున్నాడని విన్నాను." అన్నది శ్రీ

"నేనూ అతనిదగ్గిరికే పోతున్నాను కలసిపోదాం పద"



శ్రీ ఒక యాత్రికుల గుంపుతో స్వర్ణరేఖానదీతీరానికి చేరకుని, తరవాత వారినుంచి చీలిపోయింది. ఆమె చేత చిల్లిగవ్వకూడా లేదు. ఆ గుంపును విడిచినాక ఆమెకు తిండికూడా లేదు. ఈ భైరవివెంట నడిస్తే తనకు సౌకర్యంగా ఉండవచ్చు నని శ్రీకి తోచింది.

"నీ కెలా జరుగుతున్నది?" అని ఆమె భైరవి నడిగింది.

"బిచ్చ మెత్తుతాను," అన్నది భైరవి

"నా కది చాతకాదు. అంతకంటె వైతరణి నాశ్రయించటమే నయమేమో."

"ఫరవాలేదు. నీ బదులుకూడా నేనే బిచ్చ మెత్తుతాను."

శ్రీకి భైరవిని చూస్తుంటే ఆశ్చర్యం కలిగింది. ఆమె తనకన్న చిన్నది, తన కంటె చాలా అందగత్తెకూడానూ. కాని ఆమె భైరవి కావటంచేత నిర్భయంగా తిరగగలుగుతున్న దని శ్రీ అనుకున్నది. కాని తన మా టేమిటి?

"నీకూడా భైరవివేషం వేస్తానుపట్టు. ఆ మాటకు వస్తే నాదీ దొంగవేషమే నేను భైరవినికాను, వైష్ణవిని," అన్నది భైరవి.

ఒక చెట్టుకింద కూర్చొని భైరవి శ్రీకికూడా భైరవివేషం వేసింది. జుట్టుకు బూడిద పూయించుకుని, శరీరానికి కావిరంగు వేయించుకుని, కంఠానికీ చేతులకూ రుద్రాక్షమాలలు చుట్టించుకుని, నుదుట రక్తచందనతిలకం పెట్టించుకుని శ్రీకూడా భైరవిగా మారిపోయింది.

తరవాత వారిద్దరూ ప్రతంబానది దాటి ...

ఆ రాత్రి పడుకున్నారు.

మళ్ళీ మర్నాడు బయలుదేరి వారు నడక సాగించారు శ్రీ తనకథ అంతా చెప్పి "నీకు హస్తసాముద్రికం తెలుసునా? తెలిసినవారికి నా చెయ్యి చూపించాలని ఉన్నది" అన్నది.

"లలితగిరిలో హస్తికుంభ మనే గుహలో ఒక మహాయోగి ఉన్నాడు. ఆయన గొప్ప సాముద్రికవేత్త కొంచెం కష్టపడితే ఈ సాయంకాలం అక్కడికి చేరుకోగలం." అన్నది భైరవి.

విరూపానదీతీరాన ఉన్నది లలితగిరి. అందులోనే హస్తికుంభ మనే గుహ ఉండేది ఆ గుహలో గంగాధరస్వామి ఉండేవాడు. శ్రీ, భైరవీ ఆ గుహకు చేరుకునే సరికి గంగాధరస్వామి సమాధినిష్ఠలో ఉన్నాడు అందుచేత వారా రాత్రి గుహ వెలుపలనే పడుకున్నారు

మర్నాడు గంగాధరస్వామి కాలకృత్యాలు తీర్చి, విరూపానదిలో స్నానం చేసి రాగానే భైరవీ, శ్రీ ఆయన పాదాలకు వందనం చేశారు

స్వామి భైరవిని అదివరకే ఎరుగును శ్రీ ఎవరని ఆయన భైరవి నడిగాడు. శ్రీ ఒక ప్రయాణీకురాలనీ, ఆయనవద్ద చెయ్యి చూపించుకోవటానికి వచ్చిందనీ గంగాధరస్వామికి భైరవి చెప్పింది

ఆయన ఆమె చెయ్యి చూసి, "నువు రాజపత్నివి కావలసినదానివి," అన్నాడు

"నా భర్త రాజేనని విన్నాను, కాని చూడలేదు"

"చూడలేవు శుభగ్రహాలకు పాపదృష్టి ఏర్పడింది నీకు రాజ్యభోగాలు రాసి పెట్టి లేవు"

"ఇంకేమైనా దుర్దశ లున్నాయా?"

"నీవల్ల నీకు ప్రియుడైనవాడి ప్రాణాలు పోతాయి"

శ్రీ వెంటనే లేచి వెళ్ళిపోసాగింది

స్వామి ఆమెను కూర్చోమని సంజ్ఞ చేసి, "నీ కింకొక మహాయోగ మున్నది ఆ యోగం వచ్చినప్పుడు నీవు నీభర్తవద్దకు పోతావు." అన్నాడు

"అదెప్పుడు?"

"చాలాదూరం ఉంది వచ్చే సంవత్సరం ఇక్కడికి వచ్చావంటే చెబుతాను భైరవీ అప్పుడు నువుకూడా రా." అన్నాడు గంగాధరస్వామి,

ఇద్దరూ అక్కడనుంచి బయలుదేరి ఒరిస్సా రహదారివెంట జగన్నాథానికి ప్రయాణమయ్యారు

దారిలో భైరవి తన అసలుపేరు జయంతి అనీ, శ్రీ తనను ఆ పేరుతోనే పిలవవచ్చుననీ అన్నది, కాని తన అసల రహస్యం తరవాత చెబుతా నన్నది.

"ఇక ముందు కాలయాపన ఏవిధంగా చేయదలుచుకున్నావు ?" అని జయంతి శ్రీని అడిగింది

"ఇన్నాళ్ళు గడవలేదా ?" అన్నది శ్రీ

"సుఖంగా గడిచాయా ?"

"భయంకరంగా గడిచాయి అలాటి కష్టా లెవరికీ రావేమో అనుకుంటాను"

"నీ మనసు దేనిమీదనైనా తిప్పుకో,"

"పాపంమీదికా ?"

"కాదు, పుణ్యంమీదికే"

"భర్తకు సేవచెయ్యటంకన్న ఆడదానికి పుణ్య మేమిటి? అది లేకపోయాక ఇంక పుణ్య మేమిటి?"

"నీ నాథుడి కొక నాథు డున్నాడు"

"ఆయన నా నాథుడికి నాథుడేమోగాని, నాకు నాథుడుకాదు నాకున్న నాథుడల్లా నా భర్తే"

"అలాటప్పుడా భర్త నెందుకు వదిలివచ్చావు ?"

"నా జాతకం విన్నావుగా ? ఆసంగతి నాకు ఇదివరకే తెలుసు"

"అలాటప్పుడు ఆ భర్తమీద నీ కింత ప్రేమ దేనికి ? అతన్ని చూడనైనా చూడ లేదని అనుకోవచ్చుగద !"

"నీ కీశ్వరుడంటే ఎందుకు ప్రేమ? నువ్వు ఈశ్వరుణ్ణి చూశావా?"

"నే నీశ్వరుణ్ణి అహోరాత్రాలు ధ్యానిస్తాను"

"అలాగే నేనూ నాభర్తను అహోరాత్రాలూ ధ్యానిస్తాను ఇద్దరమూ కలిసి సంసారం చేస్తున్నట్లయితే ఇలా ఉండేదికాదేమో ప్రతి మనిషిలోనూ ఏవో లోపా లుంటాయి ఒకవేళ నాభర్తలో ఏలోపమూ లేకపోయినా, నా మూలంగా కలిగిఉండునేమో కాని భర్తకు దూరంగా వుండి ఎల్లప్పుడూ ధ్యానం చేస్తుండటం చేత నేను చేసే ప్రతిపనీ ఆయనకే అంకిత మవుతున్నది నే నలాటిదాన్ని జయంతీ. ఆయన్ని విడిచివచ్చాను ఆయన నన్ను పిలిచినా నేను వెళ్ళలేదు." అంటూ శ్రీ వెక్కి వెక్కి ఏడవసాగింది

జయంతి కంటకూడా నీరు కారింది

## ద్వితీయ భాగం

సీతారాం తలపెట్టిన హిందూరాజ్య స్థాపనోద్యమం ఆతని హృదయంలోనే నీరు కారిపో నారంభించింది. అందుకు కారణం శ్రీ. మొదట అతని హృదయంలో కొద్దిచోటు ఆక్రమించిన శ్రీ క్రమంగా హృదయమంతా ఆక్రమించుకని, అక్కడ మరి దేనికీ చోటులేకుండా చెయ్యసాగింది. ఆమె ఎక్కడైనా అడుక్కు తింటున్నదా? లేక, కష్టాలు భరించలేక ప్రాణత్యాగం చేసుకున్నదా? ఈ సమస్య అతని మనస్సును తినివేస్తుంటే హిందూ రాజ్యస్థాపనమూ, తన రాజవైభవమూ అతనికి పట్టకుండాపోయాయి

తన మనసులో కలుగుతున్న ఈ పరిణామాల వైనం ఎవరికీ తెలియదు అతను శ్రీ కొరకు వెతికిస్తున్న సంగతికూడా వెతికేవాళ్ళకు తప్ప మరెవరికీ తెలియదు కాని అతనిలో మార్పేదో ఉన్న సంగతి అందరూ గుర్తించారు. నంద అతనికి సంతోషం కలిగించటానికి విశ్వప్రయత్నాలు చేసింది. రమ మాత్రం, "వన్నాయన ఎందుకో ప్రేమించటంలేదు," అనుకుని తన భర్తకు ఏడుపు మొహంతో ఎదురుకాసాగింది. ఆమె ఎదటపడితే సీతారాంకు అసహ్యం వేసింది

ఇంటినుంచి వెళ్ళిపోవడానికి సీతారాం ఒక ఎత్తు వేశాడు అతను చంద్రచూడుడితోనూ, తన భార్యలతోనూ, "నేను ఢిల్లీ పోతున్నాను. పాదుషా ఇంతదాకా నాకు సనదు పంపలేదు, నన్ను రాజుగా ప్రకటించలేదు. నేను వెళ్ళి సనదు తెచ్చుకుంటాను," అన్నాడు

కాని అతను వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్న సమయం ఏమాత్రమూ మంచిది కాదు రాజకీయంగా అప్పటి పరిస్థితి ఎలా ఉన్నదంటే -

బెంగాలు పరగణాకు సుబేదారు ముర్షిద్ కులీఖాన్ అతను స్వచ్ఛమైన బ్రాహ్మణవంశంలో జన్మించి, కులభ్రష్టుడై ఇస్లాముమతం పుచ్చుకున్నవాడు ఫౌజ్‌దారైన తోరాబ్‌ఖాన్‌కూ అతనికీ పడదు సీతారామును నిర్మూలించాలని నిశ్చయించుకున్న తోరాబ్‌ఖాన్, సుబేదారు తరవాత తనను ఆక్షేపించకుండా ఉండగలందులకు, సీతారాం గురించి ఒక అభియోగపత్రం తయారుచేసి కులీఖాన్ ఆ పత్రాన్ని తన వద్ద పెట్టుకుని జవా బివ్వకుండా కూర్చున్నాడు

కొద్ది కాలం జరిగేటప్పటికి కొత్త పరిణామాలు కలిగాయి హిందువులు విజృంభించటం ముసల్మానులకు కొట్టవచ్చినట్టు కనబడింది ముసల్మానులు హిందువులపైన పడి దేశమంతటా అత్యాచారాలు సాగించారు. ఒక్క మహమ్మదు పురములో మటుకు హిందువులకు ముసల్మానుల భయమేమీ లేదు ఇదంతా గ్రహించి

ముర్షిద్‌కులీఖాన్ సీతారాంను నాశనం చెయ్యవలిసిందిగా తోరాబ్‌ఖాన్‌కు తెలియజేశాడు

ఇంతమాత్రంచేత తోరాబ్‌ఖాన్ సమస్య తీరలేదు. ఎందుకంటే సుబేదారు తోరాబ్‌ఖాన్‌కు సైనికసహాయ మేమీ చెయ్యలేదు; చెయ్యవలిసిన అవసరంలేదుకూడా.

ఈ కారణంచేత తోరాబ్‌ఖాన్ ప్రయత్నాలు చురుకుగా సాగలేదు. కొద్దిమంది సిపాయిలకు మహమ్మదుపురం లొంగేదికాదు. అక్కడ యువకు లందరూ సైనిక శిక్షణ పొందిఉన్నవారే నని తోరాబ్‌ఖాన్‌కు తెలుసు. అందువల్ల అతను తన సైన్యాన్ని వృద్ధిచెయ్యాలి. అది అంత త్వరగా జరిగే పనికాదు.

చంద్రచూడుడు భూషణలో ఏర్పరచిన చారులద్వారా ఆతని ప్రయత్నా లన్నీ ఎప్పటికప్పుడు మహమ్మదుపురంలో తెలుస్తూనే ఉన్నాయి.

ఇలాటి సమయంలో సీతారాం ఢిల్లీకి పోతున్నా నని ప్రకటించాడు సీతారాం ఈ సమయంలో మహమ్మదుపురం వదిలివెళ్ళటం మంచిదికాదని తెలిసికూడా చంద్రచూడుడు అతన్ని ఢిల్లీ వెళ్ళనివ్వటమే మంచిదని నిశ్చయించాడు. ఎందుకంటే గెలిచినా ఓడినా ఫౌజ్‌దారుతో యుద్ధం క్షేమంకాదు. సీతారాం పాదుషాచేత ఈ పరగణాకు రాజుగా సనదు పొందినట్టయితే ఫౌజ్‌దారూ, సుబేదారూ చెయ్యి చేసుకోలేరు.

"ఢిల్లీలోని అమీర్లూ, ఉమ్రావులూ, చివరకు పాదుషాకూడా అమ్ముడుపోయే వారే. అందుచేత డబ్బు ఖర్చుచేస్తే నీపని తేలికగానే అవుతుంది. నీవు మూడు నాలుగు మాసాలలోపల తిరిగివచ్చినట్టయితే ఈ లోపల ప్రమాదం జరగకుండా చూడగల మనుకుంటాను. నగరాన్ని రక్షించటానికి మృణ్మయి ఉన్నాడు. నేను తోరాబ్‌ఖాన్‌ను మంచిమాటలతో నిగ్రహించి ఉంచగలను." అన్నాడు చంద్రచూడుడు సీతారాంతో.

సీతారాం అవసరమైన ధనమూ, కొంత పరివారమూ వెంటబెట్టుకుని ఢిల్లీకి బయలుదేరాడు. నిజంగా తా నెక్కడికి వెళుతున్నదీ సీతారాం ఒక్కడే ఎరుగును.

## 2

సీతారాం నగరం విడిచి ఢిల్లీకి పోయినట్టు తెలిసి, మహమ్మదుపురాన్ని ముట్టడించటాని కిదే అదననుకుని ముట్టడికి తగిన సన్నాహాలను తోరాబ్‌ఖాన్ చురుకుగా సాగించాడు. ఈ వార్త మహమ్మదుపురంలో పొక్కింది నగర మెంతో సంక్షోభించిపోయింది. అనేకమంది పౌరులు తట్టా బుట్టా కట్టేసుకుని, ఇతర ప్రాంతాలలో ఉండే తమ దగ్గిరి బంధువులవద్దకూ, దూరపు బంధువుల వద్దకు సైతం ప్రయాణ మయారు. వృత్తివిద్యలవాళ్ళు తమ పనిముట్లనూ, షావుకార్లు

తమ ధనాన్నీ, వర్తకులు తమ వస్తువులనూ తీసుకుని నగరం వదిలిపోసాగార నగరం అల్లకల్లోలంగా ఉన్నది.

నగర రక్షణభారం వహిస్తున్న గంగారాం చంద్రచూడుడివద్దకు వెళ్ళి పట్టణ ఖాళీ అవుతున్నదనీ, చాలామంది వెళ్ళిపోతున్నారనీ చెప్పాడు.

"ఆడవాళ్ళూ, ముసలివాళ్ళూ, పిల్లలూ నగరం ఖాళీ చెయ్యవలిసిందే,' అన్నాడు చంద్రచూడుడు.

"తోరాబ్‌ఖాన్ వచ్చిపడినదాకా చూస్తూ ఉండేకన్న. ఎదురు వెళ్ళి వాణ్ణి మధ్య దారిలోనే మట్టుపెడితే నగరానికి నష్టం తప్పుతుంది గదా ?" అన్నాడు గంగారాం

"తవ్వని ఆగ్తలాటి నదియొక్క రక్షణను వదులుకుని పోయి, మధ్యదారిలో ఒకవేళ అపజయమే పొందావనుకో, ఎక్కడ కాలు నిలవదొక్కుకుంటావు ? నీ సైన్యాన్నీ, ఫిరంగులనూ, గుండు సామగ్రీ నది ఇవతలి తీరాన ఆయత్తం చేసిన ట్టయితే శత్రువులు నది దాటి రాలేరు; వాళ్ళు నదిని ఎక్కడ దాటదలిస్తే అక్కడే ప్రతిఘటించవచ్చు. అంతా సిద్ధం చేసుకునిఉండు. ఎప్పుడు బయలుదేరవలిసిందీ నేను చెబుతాను," అన్నాడు చంద్రచూడుడు

తోరాబ్‌ఖాన్ ఎప్పుడు బయలు దేరేదీ, ఏమార్గాన వచ్చేదీ గూఢచారుల ద్వారా ఆయన కింకా తెలియలేదు. ఆయన ఆ సమాచారంకోసం ఎదురు చూస్తూన్నాడు.

నగరంలో తెలిసే వార్తలు కొంచెం అతిశయించి ఉంటాయి. 'శత్రువులు వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకా బయలుదేరలేదు,' అని ఊళ్లోవాళ్ళకు వార్త వస్తే, 'ఇం కేముంది ? శత్రువులు వచ్చిపడిపోయారు !' అన్నవార్త అంతః పురమంతా గగ్గోలెత్తిపోయింది.

అంతఃపుర వ్యవహారాలు చూసే భారాన్ని సీతారాం నందపైన పెట్టి వెళ్ళాడు. కాని ఒక్కతె ఎంతమందిని సమాధాన పరచగలదు ? మిగిలినవాళ్ళమాట అటుంచి, రమ క్షణక్షణమూ మూర్ఛపోతున్నది. ఆమె చచ్చినా తన ప్రాణానికి సుఖంగా ఉండు ననుకున్నది నంద. కాని ఆమెను బతికిఉంచటమే తన బాధ్యతగనక నందకు రమ ఉపచారాలతోటే సరిపోయింది.

ఒకవంక ఆమెను పౌరస్త్రీలు పట్టి పీడించారు.

"యుద్ధమూవద్దు, పాడూవద్దు. అంతఃపురాన్ని ముసల్మానుల వశం చేశావంటే అందరమూ బతికిపోతాం. అలా చేసి రక్షించమని వేడుకుంటే వాళ్ళు వింటారు. బెంగాలీవాళ్ళం, మనకు యుద్ధం దేనికి తల్లీ ? బతికుంటే అంతేచాలు. మా అందరి ప్రాణాలూ నీ చేతిలో ఉన్నాయి," అన్నారు వాళ్ళు.

"ఇప్పు దేం భయం వచ్చిపడింది? ఉంటే మగవాళ్ళకు తెలియకుండానే మీకుతెలి సిందా? మీ ప్రాణాలను వాళ్ళు రక్షించారా?" అన్నది నంద

ఈ సంభాషణ ఆలకిస్తున్న రమ మూర్ఛపోవటం తగ్గించి ఒక కొత్త ఆలోచనలో పడింది

ఆరాత్రి గంగారాం సామాన్య దుస్తులు ధరించి నగరమంతా కాలినడకన గస్తీ తిరిగాడు అత నలా మూడుజాములు దాటినదాకా తిరిగి అలిసిపోయి ఇంటికి తిరిగి వెళుతుండగా, ఎవరో ఆడది వెనుకనుంచి అతని ఉత్తరీయం పట్టుకున్నది.

"ఎవతెవు నువు? అర్ధరాత్రి ఎందుకు తిరుగుతున్నావు." అని గంగారాం ఆమెనడిగాడు.

"నీకోసమే తిరుగుతున్నాను."

"అబద్ధం? నే నెవరోకూడా నీకు తెలీదు."

"మీరు గంగారాంగారు, నగర రక్షకులు "

"సరే, నన్నెరుగుదువన్నమాట. నాతో ఏంపని?"

"ఒక సాహసకార్యం చెయ్యాలి. నేను తీసుకుపోయేచోటికి వస్తావా?"

"నీ పేరేమిటి? నే నేం చెయ్యాలి?"

"నాపేరు మురళ. ధైర్యముంటే నా వెంట రా. లేకపోతే మానెయ్యి."

గంగారాం ఆమె వెంట వెళ్ళకతప్పలేదు. ఆమె అతన్ని రాజభవనంకేసి తీసుకుపోయింది.

"మనం రాజభవనానికి పోతున్నా మేమిటి?" అన్నా డతను.

"పోవటం తప్పా?" అన్నది మురళ.

"అంతఃపురంలోకి ఆజ్ఞ లేకుండా ఎలా వస్తాను?"

"ఎవరి ఆజ్ఞ కావాలి నీకు. రాజుగారు ఊళ్ళోలేడు. రాణిగారి ఆజ్ఞ చాలా?"

"చాలు."

"రాణిగారి ఆజ్ఞ అయింది, రా!"

మురళ ద్వారంవద్దకు వెళ్ళి, "పాండ్యా, తలుపు తియ్యి." అన్నది.

"తీసేఉన్నది. వీ రెవరు?" అని పాండ్యా ఆమె నడిగాడు.

"మా అన్న."

"మగవాళ్ళు అంతఃపురంలోకి వెళ్ళటానికి ఆజ్ఞలేదు."

"ఆజ్ఞలేదూ? నా ఆజ్ఞ చాలదా? ని న్నేం చేయిస్తానో చూసుకో."

పాండ్యా బెదిరిపోయి గంగారాంను లోపలికి వెళ్ళనిచ్చాడు. మురళ గంగారాంకొక గది చూపి. "అందులోకి వెళ్ళు." అన్నది.

రత్నాలంకారాలు గల ఆ అందమైన గదిలో వెండిమంచంమీద జగదేకసుందరి లాటి స్త్రీ కూర్చుని అతనికి కనబడింది. ఆమె రమ.

గంగారాం ఈ అంతఃపురంలోకి ఎన్నడూరాలేదు. సీతారాం భార్యలైన నందను గాని, రమనుగాని అత నెన్నడూ చూసిఉండలేదుకూడా. అయినా అతను, ఈమె. రమ అయిఉంటుం దని ఊహించి, "మహారాణిగారు న న్నెందుకు పిలిపించారు ?" అని అడిగాడు.

"భయం చేత మిమ్మల్ని పిలిపించాను. నన్ను మీరు రక్షించాలి."

"ఇప్పు డేమయింది ?"

"ఏమయిందీ తెలీదా ? ముసల్మానులు మహమ్మద్‌పురంమీదికి దండెత్తివస్తున్నా రని తెలీదా? వాళ్లు వచ్చి మా అందర్నీ చంపి, పట్టణమంతా తగలేసి బూడిచేసి పోతారు " రమ ఏడవసాగింది.

"మీ కేమీ భయం కలగకుండా మేం కాపాడతాం. విచారించకండి. న న్నేం చెయ్యమంటారు ?" అన్నాడు గంగారాం.

"నా నగలన్నీ ఇస్తాను; నా దగ్గిర ఉన్న ధనమంతా ఇస్తాను మీరు ఎవరికీ తెలియకుండా ముసల్మానుల వద్దకు వెళ్ళి, మన రాజ్యాన్నీ, నగరాన్నీ వాళ్ళ కిస్తా మనీ, వాళ్ళు ఎవరినీ హింసించకుండా ఉండాలనీ వేడుకోవాలి. వారు సరే నన్న ట్టయితే, పట్టణం మీ రక్షణలోనే ఉన్నది గనక, వాళ్ళను రహస్యంగా తీసుకువచ్చి అప్పజెప్పెయ్యవచ్చు. అందరమూ బతికిపోతాం."

ఈ మాటకు గంగారాం కంపించిపోయి, "మహారాణీ, ఈ మాట నా దగ్గిర అంటే అన్నారు. మరెవరి దగ్గిరా అనకండి చచ్చినా నే నిలాటి పని చెయ్యను. మరొకరు చేస్తే వాళ్ళ తల తీసేస్తాను." అన్నాడు.

"ఇక నా బిడ్డ గతేం కావాలి ?" అంటూ రమ గట్టిగా ఏడ్చింది.

"ఏడవకండి. ఎవరైనా రాగలరు. మనిద్దరికీ మంచిదికాదు. మీ భయమంతా మీ బిడ్డకోసమే అయితే మీరు కోట విడిచి మరెక్కడికైనా పోవచ్చు." అన్నాడు గంగారాం.

"మా పుట్టింటికి తీసుకుపోయే టట్టయితే వస్తాను. కాని అందుకు నందాదేవీ, చంద్రచూడుడూ సమ్మతింపరేమో !"

"ఎవరికీ తెలియకుండా నేను రహస్యంగా తీసుకుపోతాను; కాని ఇప్పుడే ఏమంత తొందరలేదు. తొందర కలిగినప్పుడు నేనే చెబుతాను."

రమ అతనికి తన కృతజ్ఞత తెలుపుకుని పంపేసింది.

ఇదే సమయంలో చంద్రచూడుడు ఒక గూఢచారిద్వారా తోరాబ్‌ఖాన్‌కు ఒక సందేశం పంపాడు: "యుద్ధంవల్ల లాభంలేదు. మేము మా రాజ్యాన్ని కోటతో సహా అమ్మేస్తాం; ఎంతకు కొంటారు?" ఇలా కబురు పంపానని ఆయన మృణ్మయుడికీ, గంగారాంకూ కూడా చెప్పాడు.

మృణ్మయుడు తోకతొక్కిన తాచులాగా అయి, కళ్ళెర్రచేస్తూ, "ఇదేం రాయబారం?" అన్నాడు.

"మూర్ఖుడా! నీకు వివేకం కొంచెంకూడాలేదు. ఏదోవిధంగా రెండు మాసాలు దాటించామంటే సీతారాం తిరిగి రానేవస్తాడు." అన్నాడు చంద్రచూడుడు

గంగారాం ఏమీ మాట్లాడలేదు. అతని హృదయంలో కొత్త చిచ్చు ఒకటి రగులుతున్నది. అతను రమ అందాన్నీ, ఆకర్షణనూ మరిచిపోలేకుండా ఉన్నాడు. ఆమె తనది అయినట్టు కలలు కనసాగాడు. ఆమెను మళ్ళీ చూడాలని అతని హృదయం తహతహలాడుతున్నది.

చంద్రచూడుడికి తోరాబ్‌ఖాన్ జవాబు పంపాడు; రాజ్యం అప్పగించినందుకు కొద్ది డబ్బే ఇస్తానన్నాడు, మీదుమిక్కిలి సీతారాంను పట్టి ఇవ్వాలని షరతుకూడా పెట్టాడు.

సీతారాంను పట్టివ్వటాని కభ్యంతరం లేదు గాని, మీ రిస్తామన్న డబ్బు ఏ మాత్రమూ చాలదు." అని చంద్రచూడుడు తిరిగి కబురు చేశాడు.

"ఎంతధనానికైతే మీ రంగీకరిస్తారు?" అని తోరాబ్‌ఖాన్ అడిగాడు.

పెద్దమొత్తం అడుగుతూ చంద్రచూడుడు మళ్ళీ కబురు చేశాడు.

కొంచెం తగ్గించుకోమని తోరాబ్‌ఖాన్ బేరంలోకి దిగాడు.

చంద్రచూడుడు ఇంకో పేచీ పెట్టాడు.

ఈ విధమైన ఉత్తర ప్రత్యుత్తరాలతో చంద్రచూడుడు రోజులు దాటవేయ సాగాడు.

గంగారాముడు రమదగ్గిరికి వెళ్ళటానికి మహాఆత్రంగా ఉన్నాడు. కాని రమ అతన్ని రమ్మని మళ్ళీ కబురు చెయ్యక, సమాచారం తెలుసుకురమ్మని మురళను పంపింది.

"ఇవన్నీ హాస్యవిషయాలు. నీతో చెప్పేవికావు. నేనే స్వయంగా వెళ్ళి మహా రాణిగారికి చెప్పాలి," అన్నాడు గంగారాం.

విధిలేక రమ గంగారాంను పిలిపించింది. అతను పని పెట్టుకుని ఆమె భయాన్ని రెచ్చగొట్టి, ధైర్యం చెప్పసాగాడు. అతనిప్పుడామె పిలవకుండానే వెళుతున్నాడు. రమ అమాయకురాలు. గంగారాం ఎందుకు వచ్చిపోతున్నదీ ఆమెకు తట్టలేదు.

ఒకరాత్రి గంగారాం వచ్చినప్పుడు పాండ్యా అతన్ని లోపలికి పోనివ్వలేదు. మురళ ఎంత బతిమాలినా అతను వినలేదు. గంగారాం మురళను అవతలికి తీసుకుపోయి, "నేనెవరో చెప్పేస్తే వాడు లోపలికి వెళ్ళనిస్తాడేమో?" అన్నాడు.

"తప్పక వెళ్ళనిస్తాడు; కాని ఆ తరవాత, ఫలానామనిషి రోజూ రాత్రివేళ అంతఃపురానికి వచ్చిపోతున్నట్టు అందరికీ చెప్పేస్తాడు. నా అన్న అని అబద్ధ మాడినందుకు నా పీక పోతుంది," అన్నది మురళ.

అది నిజమే. పాండ్యాగాణ్ణి అక్కడనే పొడిచిపారెయ్యా లనిపించింది గంగారాంకు. కాని అందువల్ల నష్టం తప్ప లాభం ఉండ దనుకుని అతను వచ్చిన దారినే వెళ్ళిపోయాడు.

"గంగారాం రాలేదేం?" అని రమ మురళను అడిగింది.

"వచ్చాడు. కాని ద్వారపాలకు డడ్డుపెట్టాడు."

"రోజూలేని అడ్డం ఇవాళే మొచ్చిందీ?"

"వాడి కేదో అనుమానం తగిలినట్టున్నది."

"ఏమని?"

"అది మీరు వినేదీకాదు, నేను చెప్పేదీకాదు."

రమగుండె గుభేలు మన్నది. ముచ్చెమటలు పోసి, వణికిపోతూ ఆమె చతికిల బడింది. తనపైన అభాండం పడుతుందని ఆమెకు తోచనైనా లేదు. మురళ అన్న మాట అర్థం కాగానే ఆమె నెత్తిన పిడుగుపడ్డట్టయింది. వెనక్కు తిరిగి చూసుకుంటే జరిగినది పొరపాటేనని తెలిసిపోయింది.

గంగారాంకు వెర్రెత్తిపోయింది. రమనుంచి మళ్ళా కబురులేదు సరేకదా, మురళకూడా కనిపించటం మానేసింది.

ఏదో విధంగా సీతారాంను నాశనం చెయ్యటానికీ, రమను పొందటానికీ నిశ్చయించుకుని గంగారాం పాపపుదారిలో పడ్డాడు.

## 3

గంగారాం అస్వస్థుడై మంచం పట్టిఉన్నాడనీ, నగరరక్షణ సరిగా సాగటం లేదనీ విని చంద్రచూడుడు అతన్ని చూడవచ్చాడు.

"నాకు జబ్బుగా ఉంది. పది రోజులపాటు ఏపనీ చెయ్యలేను," అన్నాడు గంగారాం.

"నీ శరీరంలో ఏ రోగమూ ఉన్నట్టులేదు. మనసుకు సంబంధించిన జబ్బేమో," అన్నాడు చంద్రచూడుడు.

గంగారాం మంచం మీదనే పడుకుని కర్తవ్యం ఆలోచించాడు. రమను పొంది తీరాలి. ధర్మాధర్మాల విచక్షణ అనవసరం. రమ సులువుగానే చేజిక్కుతుంది. ముసల్మానులు వచ్చి పడుతున్నారు, మీ పుట్టింటికి పదమంటే వచ్చేస్తుంది. ఆ తరవాత ఎక్కడికి కావాలంటే అక్కడి కామెను తీసుకుపోవచ్చు. అయితే ఎక్కడికి తీసుకుపోవాలన్నది పెద్ద సమస్య. సీతారాం రాజ్యంలో ఉండటం అపాయకరం, అది దాటి వెళ్ళాలి. అక్కడ ముసల్మానుల అధికారం ఉంటుంది. అతను ముసల్మానుల నుంచి పారిపోయి వచ్చినవాడు కావటంచేత, అతన్ని వాళ్లు పట్టుకుని మరుక్షణమే కొరత వేసేస్తారు. అందుచేత తిన్నగా తొరాబ్ ఖాన్‌వద్దకు వెళ్ళి అతని పక్షాన చేరటం ఒకటే మార్గం.

ఈ ప్రయత్నంలో గంగారాంకు బందేఅల్లీ అనేవాడి సహాయం అవసరమయింది. ఈ బందేఅల్లీ భూషణ నగరానికి చెందినవాడు, గొప్పయింటివాడు.

గంగారాం బందేఅల్లీ వద్దకు వెళ్ళి, "నువు తోరాబ్ ఖాన్ వద్దకు వెళ్ళి నేను చెప్పే విషయాలన్నీ అతనితో చెప్పాలి. చంద్రచూడుడు తొరాబ్ ఖాన్‌తో రాయబారాలు నడిపి మోసం చేస్తున్నాడు. మహమ్మద్ పురాన్ని అమ్మితానని కబురు చేశాడు. ఫౌజ్‌దారు కివ్వటానికి ఈ నగరం చంద్రచూడుడి ఆధీనంలో లేదు. అది ఉన్నది నా అధీనంలో. దాన్ని ఎవరికైనా అప్పగిస్తే నేనే అప్పగించాలి. సీతారాం ఇక్కడలేడు. ఈ సమయంలో నేను ఈ నగరాన్ని తోరబ్ ఖాన్ వశం చెయ్యగలను. ఆ విషయం నేను స్వయంగా తోరాబ్ ఖాన్‌తో మాట్లాడవలసి ఉంది. నువు వెళ్ళి నాకు అభయం ఇవ్వమని ఫౌజ్‌దారైన తోరాబ్ ఖాన్‌తో చెప్పాలి," అన్నాడు.

బందేఅల్లీ భూషణకు వెళ్ళి, గంగారాం చెప్పమన్న విషయాలన్నీ చెప్పేశాడు.

గంగారాంను క్షమించక చేయగలిగిం దేమీ లేదనుకుని తోరాబ్‌ఖాన్, అతన్ని క్షమిస్తున్నాననీ, మర్నాడు రాత్రి అతను వచ్చి తనను చూడవచ్చుననీ జవాబు రాసి బందేఅల్లీ ద్వారా పంపాడు.

గంగారాం రాహస్యంగా భూషణకు వెళ్ళి ఫౌజుదార్ దర్శనం చేసుకున్నాడు. ఇద్దరూ కూర్చుని కుట్రకు పథకం ఆలోచించారు.

"మీరు సేనతో మహమ్మదుపురం ప్రాంతానికి వచ్చేసరికి నేను పురద్వారం తెరిచిఉంచుతాను," అన్నాడు గంగారాం.

"నువ్వా పని చేసి ఏం లాభం? మృణ్మయుడి చేతిలో సేన ఉన్నది. అతను ఆ సేనను తెచ్చి మధ్యదారిలోనే మమ్మల్ని అటకాయిస్తే? ఆ యుద్ధంలో మేం జయించినా, ఓడినా నీ సహాయం చిల్లిగవ్వ చేయదు," అన్నాడు తోరాబ్ ఖాన్.

"ఘూషణ నుంచి మా నగరానికి రావటానికి దక్షిణంగా ఒక మార్గమూ, ఉత్తరంగా ఒకమార్గమూ ఉన్నాయి. దక్షిణమార్గంలో పోతే నదిని దూరాన దాటాలి. ఉత్తరమార్గాన వస్తే కోట ఎదటికే రావచ్చు. మీరు కోట ఎదురుగా వచ్చి నది దాటటం అసంభవమనీ, అందుచేత దక్షిణమార్గానే వస్తారనీ, అక్కడే మిమ్మల్ని ఎదిరించాలనీ మృణ్మయుడి ఆలోచన. అతను మిమ్మల్ని మార్గమధ్యంలో ఎదరించ దలిచినా దక్షిణమార్గానే తన సేనలను నడిపిస్తాడు. మీ రా సమయం కనిపెట్టి ఉత్తరమార్గాన వచ్చి, కోట ఎదట నది దాటి, కోటను వశపరచుకోవచ్చు ఆ సమయంలో కోటకు సైనిక రక్షణ ఉండదు. ఉన్నా అతి స్వల్పంగా ఉంటుంది"

"ఇది చాలా మంచిఆలోచన. మా మేలు కోరుతున్నా వనటానికి సందేహం లేదు. కాని ఏదో ప్రత్యుపకారం కోరకుండా నువ్వీ పనికి దిగలేవు. నీకు కావలసిం దేమిటి?" అని తోరాబ్ ఖాన్ గంగారాం నడిగాడు.

"నద్దీపరగణాను నాకు జాగీరుగా ఇప్పించండి."

"మహమ్మదుపురం ఇక హిందువులచేతిలో ఉండబోదు. కావలిస్తే అక్కడే నీ కొక పటాలానికి అధికారం ఇస్తాం. కొంత డబ్బూ, కొన్ని గ్రామాలుకూడా ఇస్తాం"

"అదంతా మీ యిష్టం. కాని నాది మరొక కోరిక ఉంది. సీతారాంకు ఇద్దరు భార్య లున్నారు —"

"వారు నీకు దక్కరు, నవాబుగారికి —"

"పెద్దామె నందను ఆలాగే ముర్షిదాబాదు పంపండి. చిన్నామె రమను నా కిప్పించాలి."

"ఆమెలేక నీకు స్వర్గమే లేనిపక్షంలో ఆమె నీకు దక్కేటట్టు ప్రయత్నిస్తాను దిగులుపడకు."

గంగారాం తోరాబ్ ఖాన్‌కు సలాం కొట్టి ఆ రాత్రే మహమ్మదుపురానికి తిరిగి వచ్చాడు.

మర్నాడు ఫకీరు చంద్రచూడుడి దగ్గిరికి వెళ్ళి, "చాలా సంతోషం. ముసల్మానులకే జయం కలగబోతున్నది." అన్నాడు.

ఫకీరు విద్రోహి కాడని ఎరిగిన చంద్రచూడుడు, "ఏమిటి విశేషం?" అన్నాడు.

"హిందువులు ముసల్మానుల పక్ష మవుతున్నారు," అన్నాడు ఫకీరు

"నిజమైన హిందువు అలా చెయ్యరు."

"మీ నగరపాలకుడు గంగారామే వాళ్ళ పక్షాన ఉన్నాడు."

"గంగారాము స్వచ్ఛమైన హిందువు; విశ్వాసపాత్రుడు."

"అందుకనేనా అతను నిన్న రాత్రి భూషణకు వెళ్ళి, తోరాబ్‌ఖాన్‌తో మాట్లాడివచ్చాడు ?"

"నేను నమ్మను."

"నే నతని వెంటే వెళ్ళి, అతని వెంటే వచ్చాను." అని చెప్పి ఫకీరు వెళ్ళి పోయాడు.

చంద్రచూడుడు తన కర్తవ్యం గురించి యోచించాడు. గంగారాంను ఉద్యోగం నుంచి తీసేసి ఖైదులో ఉంచటం తప్ప మార్గాంతరం లేదు. కాని అతను తిరగబడి 'నన్ను ఉద్యోగంనుంచి తీసెయ్యటానికి నీ వెవడవు ?' అంటే ఏం చెయ్యాలి ? నగర రక్షక భటు లంతా అతని కిందివారేకూడానూ. తలుచుకుంటే అతనే తనను ఖైదులో పెట్టించగలడు.

అందుచేత చంద్రచూడుడు గంగారాం ధోరణి ఎలా ఉన్నదీ చూద్దా మనుకు న్నాడు. ఆ సాయంకాలమే ఆయనకు, ఫౌజ్‌దార్ సేనలు దక్షిణ మార్గాన మహమ్మదు పురం మీదికి ఎత్తివస్తున్నట్లు గూఢచారుల ద్వారా తెలిసింది. ఆయన మృణ్మ యుణ్ణీ, గంగారాంనూ పిలిపించి యుద్ధాలోచన చేశాడు. మృణ్మయుడు సైన్యంతో దక్షిణమార్గంగా వెళ్ళి, ముసల్మానులు నది దాటకుండా చూడాలని నిశ్చయ మయింది.

"నీవెంట గంగారాం రెండవ సేనాపతిగా ఉండటం మంచిదని నాకు తోస్తు న్నది," అని చంద్రచూడుడు మృణ్మయుడితో అన్నాడు.

"నేను వెళతానుగాని పట్టణ మెవరు కాపాడుతారు ?" అన్నాడు గంగారాం.

"మరెవరైనా చూడవచ్చు," అన్నాడు చంద్రచూడుడు.

"రాజుగారు నా కాపని స్వయంగా అప్పగించారు. నేను పట్టణం విడిచిపోవటం పొసగదు," అన్నాడు గంగారాం.

ఈమాటతో చంద్రచూడుడి అనుమానం జాస్తి అయింది. "నీ బుద్ధికి మంచి దని తోచినపని చెయ్యి," అన్నా డాయన.

మృణ్మయుడు సేనతోసహా ఆరాత్రే దక్షిణమార్గాన బయలుదేరి వెళ్ళాడు. కోటను రక్షించటానికిగాను కొద్దిసేన గంగారాం ఆధీనంలో ఉండిపోయింది.

ముసల్మానులు వచ్చి పడుతున్నా రన్న సంగతి అంతఃపురంలోకూడా తెలిసింది. మురళ రమతో, "అమ్మగారూ, మీ రిక పుట్టింటికి ప్రయాణం కావచ్చు," అన్నది.

"చస్తే ఇక్కడే చస్తానుగాని, పాపమార్గం తొక్కను. నేను చచ్చినా నాబిడ్డను గంగారాం కాపాడతానని మాటఇచ్చాడు. అతని వద్దకు వెళ్ళి అమాట జ్ఞాపకం

చేసిరా. సమయం వచ్చినప్పుడు వచ్చి నా బిడ్డను కాపాడమని చెప్పు." అన్నది రమ, ఆమె తన మనస్సును రాయిచేసుకొని నందవద్దకు వెళ్ళి కూర్చున్నది. ఆ రాత్రి నగరం నిద్రపోలేదు.

మురళ గంగారాం వద్దకు వచ్చి, రమ చెప్పమన్న దంతా చెప్పింది

"ఇప్పుడే వచ్చి బిడ్డను తీసుకుపొమ్మన్నదా ?

"లేదు. మహమ్మనులు పట్టణం ఆక్రమించినప్పుడు వచ్చి అబ్బాయిగారిని రక్షించమని చిన్నరాణీగారి ఆజ్ఞ "

"అప్పటి పరిస్థితి ఎలా ఉంటుందో ఏం చెప్పగలం ? నేనే ఆ పిల్లవాణ్ణి రక్షించాలంటే ఇప్పుడే నాకు వాణ్ణి అప్పగించాలి "

"పిల్లవాణ్ణి నేను తీసుకురానా ?"

"వద్దు నేను వచ్చి మాట్లాడాలిసిన విషయా లున్నాయి "

"ఆ పప్పులేమీ ఉడకవు," అని నవ్వుకుంటూ మురళ బయలుదేరింది ఆమె వీధిలోకి అడుగు పెట్టేసరికి చుక్కల్లాగా వెలిగిపోతూ, చేతుల్లో త్రిశూలాలు ధరించి, ఇద్దరు భైరవీమూర్తులు తనకేసి వస్తూండటం కనిపించింది

మురళ వాళ్ళిద్దరిముందూ సాష్టాంగపడి లేచి, నమస్కారం చేస్తూ నిలబడింది

"ఎవతెవు నీవు ?" అని భైరవి ఒకతె అడిగింది.

"చిన్నరాణీగారి దాసీని "

"ఈ రాత్రివేళ నగరపాలకు డింటి కెందుకు వచ్చావు ?"

"మా రాణీగారే పంపారు "

"ఆ కనబడేడి దేవాలయం కాదూ ? మాతో కూడా అక్కడికి రా "

మురళ వారి వెంట దేవాలయంలోకి వెళ్ళింది

వా రిద్దరూ శ్రీ, జయంతీనూ

హస్తికుంభ గుహలో ఉండే యోగి చెప్పిన ప్రకారం వా రిద్దరూ పీడాదిగడిచాక విరూపా నదీతీరాన ఉన్న లలితగిరికి వచ్చారు కాని యోగి శ్రీని చూడనేలేదు. జయంతి ఒక్కతే గుహలోకి వెళ్ళి కొద్దిసేపు ఆయనతో మాట్లాడివచ్చింది

ఆమె తిరిగివచ్చినదాకా నదీతీరాన అటూ ఇటూ పచార్లు చేస్తూఉండిన శ్రీ జయంతిని చూసి, నేను నా భర్త దగ్గరకు వెళ్ళటానికి మహాయోగి ఆజ్ఞ ఇచ్చారా ?" అని శ్రీ అడిగింది.

"నువు వెళ్ళటానికి ఆజ్ఞ ఇయ్యలేదు కాని, నీవెంట వెళ్ళటానికి నా కాజ్ఞ యిచ్చారు "

"దేనికి?"

"నేను వెంట వుండటం నీకు శుభమని"

"నా కిక శుభమూ, అశుభమూ, సుఖమూ, దుఃఖమూ అన్నవి లేవు."

"అవేవీ లేకపోతే ఆ మహాయోగి నీ కేమీ చెప్పేవుండరు నువు బయలుదేరు తున్నావా?"

"అదే ఆలోచిస్తున్నాను"

"ఆలోచన దేనికి? నీ ప్రియుడికి నీ మూలాన చావున్నదనా?"

"ఇప్పుడా దిగులేమీలేదు. పుచ్చేవారినే దేవుడు పుట్టించాడు. నాచేతనే చావవలసి ఉంటే చావనీ నేను బుద్ధిపూర్వకంగా చంపకుండావుంటే చాలు ఒకవేళ నా భర్తకు ప్రమాదం కలిగితే అది నా తప్పు కాకూడదు."

శ్రీ చెప్పినదానితో జయంతి తృపి పడింది.

ఇద్దరూ విరూపా నదీతీరంనుంచి గంగాతీరానికి బయలుదేరారు

## 4

ఆ రాత్రి చంద్రచూడుడు కాలుకాలిన పిల్లిలాగా నగరమంతా తిరిగాడు. ఎక్కడా నగరరక్షణ ప్రయత్నం కానరాలేదు ఎలాగైనా గంగారాంను పట్టి బంధించక పోతే కొంప లంటుకోవడం నిజం ఆపని చెయ్యటానికి సమర్థుడైన మృగయుడు సేనతో వెళ్ళిపోయాడు ఉన్న భటులందరూ గంగారాం కిందివాళ్ళు, అతన్ని పట్టి బంధించరు

ఏం జరుగుతుందోనని కలవరపడుతూ, చంద్రచూడుడు కూర్చుని ఉండగా ఆయనముందు త్రిశూలధారిణి అయిన ఒక భైరవీమూర్తి ప్రత్యక్షమయింది ఆమె జయంతి

"తల్లీ, నువ్వెవరు?" అని చంద్రచూడుడు ఆశ్చర్యంతో అడిగాడు

"శత్రువులు సమీపిస్తూంటే, కోటను రక్షించుకునే ప్రయత్నా లెందుకు జరగటం లేదో తెలుసుకుందామని వచ్చాను," అన్నది భైరవి.

"నే నేం చేసేదమ్మా? దుర్గరక్షణభారాన్ని రాజు నగరపాలుడిపైన పెట్టాడు. అత నేమీ చెయ్యకుండా ఉన్నాడు నే నేం చెయ్యాలి?"

"అలా అయితే ఈ నగరాన్ని నేనే కాపాడుకుంటాను," అంటూ జయంతి అక్కడి నుంచి బయలుదేరింది ఆమె దేవాలయంవద్దకు వెళ్ళి, దాని బయట మాట్లాడుకుంటూ నిలబడి ఉన్న శ్రీనీ, మురళనూ వెంట బెట్టుకుని గంగారాం ఇంటికి వెళ్ళింది.

గంగారాం అంధకార సముద్రంలో పడి కొట్టుకుంటున్నాడు. అతను రమకోసం ఇంత పాపాని కొడిగట్టితే. ఆమెకు తనపైన ఏమీ అనురాగం లేనట్టు ఇప్పుడు బయటపడింది

ఈ స్థితిలో ఉన్న గంగారాం ఎదట జయంతి ప్రత్యక్ష మయింది. గంగారాం తనను గుర్తిస్తాడని శ్రీ లోపలికి రాక, బయటనే మురళతో మాట్లాడుతూ ఉండి పోయింది

జయంతిని చూసి గంగారాం మురళలాగే సాష్టాంగ నమస్కారం చేసి, "తల్లీ ఏం సెలవు ?" అన్నాడు

"కొన్ని వస్తువులు కావలిసి వచ్చాను "

"తల్లీ, ఏమడిగినా ఇస్తాను ఆజ్ఞాపించు "

"నా కొక బండినిండా మందుగుండు సామాను కావాలి ఫిరంగి బారు చెయ్యటంలో సమర్థతగల ఒక మనిషికూడా కావాలి "

"తల్లీ , నువు మందుగుండుసామాను ఏం చేసుకుంటావు ?"

"దానితో ఒక దేవకార్యం ఉన్నది."

ఆమె దేవత అయితే మందుగుండు సామగ్రితో ఏంపనో మనిషయితే తానామె కెందు కివ్వాలో గంగారాం అర్థం చేసుకోలేక "తల్లీ, ఎవరు నీవు ?" అని అడిగాడు.

"నే నెవరినైతే నీ కేం ? రమ, మురళల సంగతంతా నాకు తెలుసు. నువు భూషణకు వెళ్ళి చేసిన గూడుపురానీసంగతి నాకు తెలుసు. నే నడిగినదంతా వెంటనే ఇవ్వకపొయ్యావో ఈ శూలంతో నిన్ను చంపేస్తాను." అన్నది జయంతి భయంకరంగా.

గంగారాం చెదిరిపోయి, "తల్లీ, దయచెయ్యి." అంటూ ఆమెను ఆయుధాగారానికి తీసుకుపోయి ఆమె అడిగినదంతా ఇచ్చి, ఫిరంగి బారుచెయ్యటంలో సమర్థుడైన ప్యారేలాల్ అనేవాణ్ణికూడా ఇచ్చి, బండిలో ఆమెవెంట పంపేశాడు

జయంతి. శ్రీ కోట దాటి, అంతఃపురం వెలపల ఉన్న నదీతీరానికి వెళ్ళారు వారికి దూరంగా ఒక పురుషుడు కనిపించాడు అతను అందంగానూ, కళగానూ ఉన్నాడు. శ్రీనీ, మందుగుండున్న బండినీ వదిలి జయంతి ఆ పురుషుడివద్దకు వెళ్ళి, "నువ్వెవరు ?" అని అడిగింది

"ఎవరైతేనేం ? నువ్వెవరు ?" అని అతను ఎదురడిగాడు

"వీరపురుషుడివైతే, నీకు మందుగుండు సామానిస్తాను. కోటను కాపాడు,"

అతను ఆశ్చర్యంతో జయంతికి నమస్కారం చేసి, నిట్టూర్చి, ''అందువల్ల ఏం లాభం ? ' అన్నాడు

''నీ కేం కావాలి ?''

"దుర్గాన్ని కాపాడితే నాకు కావలిసింది దొరుకుతుందా ?"

"దొరుకుతుంది "

"ఎక్కడ దొరుకుతుంది ? నువు చూడబోతే ఎవరో దేవతలా గున్నావే ! చెప్పు చూస్తాం, ఎక్కడ దొరుకుతుందో? ఈ నగరంలోనేనా? '

"అవును ఈ నగరంలోనే "

"ఎప్పుడు దొరుకుతుంది ?"

"కాస్త వ్యవధిగా "

జయంతి చీకటిలో కలిసిపోయింది

తెల్లవారుజామున చంద్రచూడుడు రాజభవనంమీది గోపురం ఎక్కి అన్ని దిక్కులూ కలియజూశాడు కోట కెదురుగా నది అవతలిఒడ్డున అనేక పడవలు కనిపించాయి

ఆయన గంగారామును పిలిపించి, "ఆ పడవలన్నీ ఎక్కడివి ?" అని అడిగాడు.

గంగారాం తనకు తెలియ దన్నాడు. కాస్త కాస్త వెలుతురు వస్తున్నకొద్దీ, అవతలి ఒడ్డున ఉండే జనసమూహం సిపాయి లని స్పష్ట మయింది.

"గంగారాం, ఇదేదో సర్వనాశనానికే వచ్చింది. మనవాళ్ళే మనని మోసం చేశారు మన సైన్యమంతా దక్షిణంగా వెళ్ళింది శత్రువు లిటుగా వచ్చారు. ఇప్పుడేది దారి ?" అన్నాడు చంద్రచూడుడు.

"చెయ్యవలసింది చెయ్యటానికి నే నున్నానుగా ?" అన్నాడు గంగారాం.

"కొద్దిసైన్యంతో అంతమంది శత్రువుల నెలా ఎదుర్కొంటావు? అదీగాక దుర్గ రక్షణకుగాను నువ్వేయత్నమూ చేయకపోతివి నేను ముందే చెప్పానుకూడా."

"అంత ప్రమాద మేమీ లేదు నేనూ నా సేనా ఇవతలి ఒడ్డున ఉండి శత్రువుల పడవలు రాకుండా చూస్తాం "

"అయితే వెళ్ళు, ఇంకా ఆలస్యం దేనికి ? అవతలి ఒడ్డున పడవల నిండా సిపాయీ లెక్కి బయలుదేరటానికి సిద్ధంగా ఉన్నారు."

గంగారాం గబగబా కిందికి దిగి వెళ్ళిపోయాడు. పడవలు అయిదారు వందల మంది సైనికులతో అవతలి ఒడ్డునుంచి కదిలాయి గంగారాం గాని, సిపాయిలు గాని ఇవతలిఒడ్డు కింకా వచ్చి చేరలేదు. శత్రువును ప్రతిఘటించే ప్రయత్నం

కూడా ప్రారంభం కాలేదు. ఫకీరు చెప్పినతరువాతకూడా గంగారాం గురించి తాను ముందు జాగ్రత్త తీసుకోనందుకు చంద్రచూడుడు చింతిస్తుండగా "ఢాం" అని పేలుడు వినిపించింది. అదే క్షణంలో ముసల్మానుల పడవ ఒకటి నదిలో మునిగిపోయింది. "ఆ పేలినది మన ఫిరంగే!" అనుకున్నాడు చంద్రచూడుడు.

ఆ ఫిరంగిని ఎవరు పేల్చినట్టు? కోటలోనుంచి ఒక్క సిపాయికూడా ఇంకా వెలుపలికి రాలేదు కోటపైన ఫిరంగు లున్నాయి గాని, వాటి దగ్గిర సిపాయి ఎవడూ లేడు

కోటగోడ దిగువనే ఉండే చెట్లకింద ఒక ఫిరంగి ఎప్పుడూ ఉంటుంది శత్రు నౌకలు నది దాటి రాకుండా నిరోధించటానికే ఆ ఫిరంగి అక్కడ ఉంచబడింది కాని దానిదగ్గిరికి ఎవరు వెళ్ళి ఉంటారు? ఫిరంగిగురి చూస్తే దాన్ని బారుచేసినవాడు గొప్ప సమర్థుడిలాగా కనబడ్డాడు

మళ్ళీ ఫిరంగి పేలింది ఇంకొక ముసల్మానుల పడవ బద్దలైపోయి సైనికులతో సహా మునిగిపోయింది చంద్రచూడుడు లక్ష్మీనారాయణ ధ్యానం చేస్తూ ఆనందంతో కేకలు పెట్టాడు.


పడవలలో ముందుకు వస్తున్న ముసల్మాను సిపాయిలు ఊరుకోలేదు, వాళ్ళు తుపాకులు పేల్చి ఇవతలి ఒడ్డున గుళ్ళవర్షం కురిపిస్తున్నారు అయినా ఫిరంగి పేలుతునే ఉన్నది. నది రెండు వైపులనుంచీ వచ్చే ధ్వనులతో చెవులు చిల్లులు పడుతున్నాయి నదిమీద పొగ దట్టంగా విస్తరించింది.

ధ్వని క్రమంగా తగ్గింది. ఒక మారుతం వీచి నదిపై అవరించిన పొగను ఊడ్చిపారేసింది. ఇప్పుడు యుద్ధక్షేత్రం స్పష్టంగా కానవస్తున్నది. అనేక పడవలు నదిలో మునిగాయి కొందరు ముసల్మానులు నదిలో ఈదుకుపోతున్నారు. కొన్ని శవాలు తేలిపోతున్నాయి. కొన్ని పడవలు అతివేగంగా అవతలి ఒడ్డుకు వెళ్ళిపోతున్నాయి ముసల్మానుల దాడి ముగిసింది

భగవంతుడికి ధన్యవాదాలు చెప్పుకుంటూ చంద్రచూడుడు కిందికి దిగిపోయాడు.

కోటను కాపాడటానికి ఎవరో ఫిరంగిపేలుస్తున్నారని తెలియగానే గంగారాం ఒక జమాదారును బయటికి పంపాడు వాడు తిరిగివచ్చి, ఫిరంగి పేల్చుతున్నది ఎవరైనదీ చెప్పలేకపోయాడు. చెట్ల కొమ్మలమాటున ఎవరో ఫిరంగి పేలుస్తున్నారు. దగ్గిరికి పోదామంటే గుళ్ళవర్షం.

గంగారాం వాణ్ణి జమేదారు పనినుంచి తొలగించి నలుగురు సిపాయిలను మళ్ళీ పంపాడు. వారు బయటికి వెళ్ళేసరికి పేల్పులూ, కాల్పులూ ముగిశాయి వాళ్ళు



చెట్లకొమ్మల చాటుకు వెళ్ళి చూస్తే, ఫిరంగిదగ్గిర ఒక మనిషి చచ్చిపడిఉన్నాడు, మరొకమనిషి జానకితాడు పట్టుకుని కూర్చునిఉన్నాడు. అతను బట్ట ఎగగట్టి, మొహంచుట్టూ ఉండేలాగా తలకు గుడ్డ చుట్టుకున్నాడు.

సిపాయిలా మనిషిని సమీపించి, "అన్నా, ఎందుకు ఫిరంగి పేలుస్తున్నావు ?" అని అడిగారు.

"తప్పా ? మీరు ముసల్మానుల పక్షంవాళ్ళా ఏం ?"

"మా యిష్టం. ముసల్మానులను ఆహ్వానిస్తాం; మళ్ళీ మాట్లాడితే, కాదనటానికి నువ్వెవరు ? పద, దొరగారి దగ్గిరకి," అన్నారు సిపాయిలు.

"ఎవరు దొరగారు."

"కొత్వాలుగారు."

"అలాగే వస్తాను. కాని ముందు ముసల్మాను లందరినీ వెళ్ళిపోనీ. అంతదాకా రాను—మీ కొత్వాలు వచ్చి పిలిచినాసరే...ఈ చచ్చిపోయిన మనిషి ఎవరో గుర్తించగలరా !"

దక్షిణదిక్కుగా వెళ్ళిన మృణ్మయుడు సంగతి ఏమిటి? ఫౌజ్‌దార్ తన సగం సేనను పీర్‌ఖాన్ అనేవాడి నాయకత్వం కింద పంపినట్టు తెలిపి, మృణ్మయుడు సేనతో సహా శత్రుసేనను ప్రతిఘటించి, వీరోచితంగా పోరాడి, పీర్‌ఖాన్‌ను చంపి, శత్రుసేనను నిర్మూలించి నగరానికి తిరిగి వస్తున్నట్టు వార్త వచ్చింది

ఈ వార్త విని చంద్రచూడుడు సీతారాముడితో, "మహారాజా ఇంకా చూస్తావేం? మన సేనలు నదిని దాటివెళ్ళి భూషణంపై దాడిచెయ్యటానికిదే సమయం?" అన్నాడు

## ద్వితీయ భాగం

భూషణనగరం సీతారాంకు స్వాధీన మయింది యుద్ధంలో అతనిపక్షం గెలిచింది తోరాబ్‌ఖాన్ మృణ్మయుడి చేతిలో చచ్చాడు పాదుషా ఇచ్చిన సనదు ఆధారంతో భూషణ రాజధానిగా చేసుకుని సీతారాం మహారాజయాడు

గంగారాం విచారణ త్వరలోనే జరగవలసి ఉన్నది అతని నేరాలను నిరూపించడానికి సాక్షు లున్నారు. రమ జరిగినదంతా తన భర్తకు దాచకుండా చెప్పేసింది

అయితే ఒక సమస్య వచ్చిపడింది. అమాయకురాలైన రమ చెప్పినది సీతారాం విశ్వసించి, ఆమె నిరపరాధిని అని నమ్మాడుగాని లోకం నమ్మలేదు. గంగారాంకూ రమకూ కొందరు లంకెలు కట్టారు ఆ కారణంచేతనే గంగారాంను ఖైదు చేసినట్టుకూడా చెప్పుకున్నారు. అతను చిన్నరాణి అంతఃపురంలోనే పట్టుబడ్డాడనీ, రాజ్యాన్ని ముసల్మానులకు అమ్మమని అతన్ని చిన్నరాణియే పంపిందనీ ప్రవాదలు పుట్టాయి.

ఈ పుకార్లు సీతారాందాకా వెళ్ళలేదుగాని, రాణుల చెవుల బడ్డాయి. రమాదేవికి నెత్తిమీద పిడుగు పడ్డట్టయింది. ఆమె ఆత్మహత్య చేసుకుందా మనుకున్నది. నందాదేవి ఆమెను ఆ ప్రయత్నంనుంచి మరలించి. "ప్రజలకు నీపైనున్న దురభిప్రాయం పోవాలంటే అందుకు ఒక్కటే మార్గం — నిండు సభలో జరిగినదంతా చెప్పెయ్యి. ఆపని చెయ్యగలవా? అలా చేస్తే అందరమూ అపఖ్యాతినుంచి బయట పడతాం," అన్నది

"నిండుసభలో అని ఏమిటి? ప్రపంచ ప్రజ లందరి ఎదటా చెప్పేస్తాను." అన్నది రమ

నంద వెళ్ళి సీతారాంతో, నిండుసభలో మాట్లాడే అవకాశం రమకు కలిగించమని చెప్పింది

రాజమహిషిని సభ కెలా పిలిపించటం? రమపై అపవా దుంటే రాముడు సీతను విడిచిపెట్టినట్టుగా రమను వదిలేస్తాను," అన్నాడు సీతారాం.

"రాముణ్ణి అడ్డంపెట్టుకుని నిరపరాధినిని వదిలిపెట్టేస్తారా? ఇదేనా రాజధర్మం?"

"అంతమంది సభికుల ఎదుట నా భార్యను వ్యభిచారిణిలాగా నిలబెట్టటం నాకు సాధ్యమా? నేను మనిషిని కానా?"

"మీ పెద్దభార్య యేభై వేలమంది ఎదుట చెట్టుకొమ్మ ఎక్కి చిందులు తొక్కితే మీ హృదయం గర్వంతో నిండిపోలేదా?" అన్నది నంద.

సీతారాం కళ్ళెర్రజేసి, "అది జరిగిపోయింది నందా! మళ్ళీ రాదు. రాదనే నేను విచారంతో కుంగిపోతున్నాను," అన్నాడు.

నంద కంగారుపడి క్షమాపణ వేడుకున్నది. రమ దర్బారులో మాట్లాడటానికి సీతారాం అంగీకరించాడు. అతని కొక్కటే భయం — రమ అంతమంది ఎదటా సరిగా మాట్లాడలేక ప్రజలలో మరింత అనుమానం రేకెత్తిస్తుందేమో నని

గంగారాం విచారణరోజు దర్బారంతా పురజనులతో కిటకిటలాడిపోయింది.

సీతారాం వచ్చి సింహాసనం అధిష్ఠించినప్పుడు వంధిమాగధులు కైవారాలు చేశారు. మంగళతూర్యాలు నిషేధించబడ్డాయి.

సంకెళ్ళతో సహా గంగారాంను తెచ్చి రాజు ఎదట ఉంచారు

గంగారాం, నువు నా కుటుంబంలోవాడివి, నావాడివి. పెద్ద హోదా గలవాడివి. నేను ఒకసారి నీ ప్రాణాలు కాపాడి, నీపట్ల స్నేహంగా ఉంటూవచ్చాను, విశ్వాస ఘాతకుడు చేయవలసిన పని ఎందుకు చేశావు?" అని సీతారాం గంగారాంను ప్రశ్నించాడు

"నా విరోధులు నాపైన అసత్యాలు కల్పించి నేరం మోపారు. నేను కృతఘ్నతతో ఏపనీ చెయ్యలేదు. నన్ను మీరే విచారించండి. నిరాధారంగా నన్ను మీరు శిక్షించరని నాకు నమ్మకమే," అన్నాడు గంగారాం.

"అలాగే చేద్దాం," అంటూ సీతారాం చంద్రచూడుణ్ణి సాక్ష్యం చెప్పమన్నాడు.

చంద్రచూడుడు తనకు తెలిసినదంతా చెప్పాడు ముసల్మానుః కోట నాక్రమించటానికి నది దాటి వస్తుంటే కోటను రక్షించటానికి ఎలాటి ప్రయత్నమూ గంగారాం చెయ్యలేదన్నది ఆయన సాక్ష్యంద్వారా స్పష్ట మయింది.

"దీని కేం చెబుతావు?" అని సీతారాం అడిగాడు.

"యుద్ధ విషయాలీ బ్రాహ్మడి కేం తెలుస్తాయి? ముసల్మాను లివతలి ఒడ్డుకు రామాలేదు, కోట నాక్రమించనూ లేదు. నేను వాళ్ళను వెనక్కు తరిమేసి ఉండక

పోతే ఈ బ్రాహ్మడి మాటలు అందరూ నమ్మేవారే గదా। మహారాజా, నేను కోటలో ఉండేవాణ్ణేగదా? కోట వారి వశమైతే నా కేంలాభం?" అన్నాడు గంగారాం.

"ఆ లాభంగురించి మరొకరు చెబుతారు," అంటూ సీతారాం ఫకీరును సాక్ష్యం ఇవ్వమన్నాడు.

ఆ రాత్రి తోరబ్‌ఖానుకూ, గంగారాంగూ మధ్య జరిగిన కుట్ర వివరా లన్నిటినీ ఫకీరు బయట పెట్టాడు

"నేను తోరబ్‌ఖాన్ దగ్గరకు వెళ్ళడం నిజమే కాని నా ఉద్దేశం అతన్ని మాయమాటలతో కోటదగ్గిరికి తెచ్చి చంపెయ్యాలని," అన్నాడు గంగారాం.

"తోరాబ్‌ఖాన్‌ను లంచ మడిగావా?" అని సీతారాం అడిగాడు.

"లేకపోతే అతను నన్ను నమ్ముతాడా?"

"ఏమడిగావు?"

"అర్ధరాజ్యం"

"ఇం కేమడిగావు?"

"ఇంకేమీ అడగలేదు"

"ఈ విషయం మీకేమైనా తెలుసునా? తెలిస్తే చెప్పండి," అని సీతారాం ఫకీరును హెచ్చరించాడు. ఫకీ రిలా చెప్పాడు

"నేను ముసల్మాను ఫకీరును. నేను తటస్థుణ్ణి కావటంచేత తోరాబ్‌ఖాన్ నన్ను ఆదరంగా చూసేవాడు. నే నెన్నడూ మీమాటలు వారికీ, వారిమాటలు మీకూ చెప్ప లేదు ఆత నిప్పుడు మరణించాడు గనక, తోరాబ్‌ఖాన్ నాకు చెప్పిన విషయాలు నే నిప్పుడు బయటపెట్టవచ్చు. గంగారాం తలపెట్టిన ద్రోహంగురించి నా కతను చెప్పేశాడు. గగారాం అర్ధరాజ్యం కాదు, ఇంకొకటికూడా కోరాడు."

"అ దేమిటో నిర్భయంగా చెప్పండి," అన్నాడు సీతారాం.

"అతను కోరిన రెండో బహుమానం చిన్నరాణి!"

సభలో హాహాకారాలు చెలరేగాయి. చాలామంది గంగారాంను తిట్టారు.

"ఇంతకన్న అసందర్భమైనమాట మరొకటి ఉండదు నేను చిన్నరాణిగారిని చూడనైనా లేదు, వారి నెలా కోరుతాను"

"కుక్కలాగా నువు అంతఃపురంలో ప్రవేశించలేదా?"

"ఎన్నడూ లేదు."

పాండ్య అన్న ద్వారపాలకుడు వచ్చి," ఈ గంగారాం ప్రతిరాత్రీ మురళ అన్నదని చెప్పకుంటూ అమె వెంట వచ్చి వెళ్ళేవాడు," అని చెప్పాడు

"అబద్ధం ! వీడు మురళ అన్నా నైతేమాత్రం అంతఃపురంలోకి ఎందుకు పోనివ్వాలి ?" అన్నాడు గంగారాం.

"ఈ గంగారాంగారు కొత్వాలని నాకు తెలుసు. అందుచేత అడ్డగించే ధైర్యం లేక ఆయన ఎవరో తెలియనట్టు నటించాను," అన్నాడు పాండ్యా.

నంద మురళను ముందుగానే ఆకట్టుకున్నది. నిజం చెప్పెయ్యమనీ, స్త్రీలకు మరణదండన లేదనీ, చేసిన తప్పు కొద్దిపాటి శిక్షతోనే పోతుందనీ ధైర్యం ఇచ్చింది. అందుచేత నిజం చెప్పెయ్యటానికి సిద్ధంగానే ఉంది. అలాగే చెప్పింది కూడానూ.

మురళ సాక్ష్యంతో గంగారాం హతాశుడై, "మహారాజా, ఈ మనిషి చాలా చెడ్డది. నేను నగరంలో దీన్ని చాలాసార్లు పట్టుకున్నాను. ఒకటి రెండుసార్లు శిక్షించానుకూడా. అందుచేత నామీద కోపంకొద్దీ ఇలా చెబుతున్నది," అన్నాడు.

"అయితే నువ్వింకెవరి మాటలు నమ్మతావు? చిన్న రాణి స్వయంగా సాక్ష్యమిస్తే నమ్మతావా" అన్నాడు సీతారాం.

గంగారాంకు ప్రాణం లేచివచ్చినట్టయింది. రమ ఈ సభలోకి రాదు. వచ్చినా సాక్ష్యం ఇవ్వలేదు.

"అలాగే చెయ్యండి. ఆమె చెప్పేదాన్ని బట్టి నేను దోషినని తోస్తే నన్ను శిక్షించండి," అన్నా డతను.

సీతారాం అంతఃపురంకేసి చూశాడు. మాసిన బట్టలు కట్టుకుని రమ మెల్లిగా సభకేసి నడిచి వస్తూండటం చూసి గంగారాం భయపడ్డాడు. సభికులలోకూడా కలకలం బయలుదేరింది.

రమ మహారాజుకూ, చంద్రచూడుడికీ దూరంనుంచే నమస్కారం చేసి, నెత్తిమీదినుంచి మేలిముసుగు తొలగించి బొమ్మలాగా నిలబడింది. ఎంత మసిబట్టలు కట్టుకున్నా ఆమె అపూర్వ సౌందర్యం కొట్టవచ్చినట్టు కనిపిస్తూనే ఉన్నది.

సీతారాం మౌనంగా తల వంచుకుని కూర్చుని ఉండటం చూసి చంద్రచూడుడు, "మహారాణీ, గంగారాం నేర విచారణ జరుగుతున్నది. ఇతను ఎప్పుడన్నా మీ అంతఃపురానికి వచ్చాడా ? మీతో ఏమైనా మాట్లాడాడా? ఆ సంగతులన్నీ వివరించి చెప్పండి. నిజమే చెప్పమని మహారాజు ఆజ్ఞ, నా ఆజ్ఞ," అన్నాడు.

"మహారాజు భార్య ఎన్నడూ అబద్ధం చెప్పదు. గురుదేవా, చెప్పటానికేముందీ ? రాజుగారి భృత్యుడు నాకూ భృత్యుడే. నే నతన్ని ఆజ్ఞాపించి పని చేయించుకో కూడదా ? నేను రాచకార్యం మీదనే కొత్వాలును పిలిపించాను. అతను వచ్చి



నా ఆజ్ఞ విని వెళ్ళిపోయాడు. దానికి విచారణ ఏమిటి ? నేను సాక్ష్యం చెప్పే దేమిటి?" అన్నది రమ

ఈ మాటలు విన్న ప్రజలకు ఆమె దోషం రుజు వయినట్టే తోచింది

"రాత్రివేళ ఏ రాచకార్యంమీద కొత్వాలును పిలిపించవలిసివచ్చింది ?" అని చంద్రచూడు డడిగాడు

"అలా అయితే అంతా చెప్పేస్తాను." అంటూ రమ ఒక్కసారి దాది చంకన ఉన్న కొడుకుకేసి చూసి చెప్పసాగింది. ఆమె అంతా చెప్పి. "నా పసిబిడ్డ కేం ప్రమాదం జరుగుతుందో నని సాహసానికి ఒడిగట్టాను." అన్నది. ఆమె చప్పున తన కొడుకును దాదినుంచి తీసుకుని సీతారాం కాళ్ళపై పడేసి. కన్నీరు కార్చుతూ. "మహారాజా. మీకు వేరేపిల్ల లున్నారు. రాజ్యం ఉంది. నాకు వీ డొక్కడే బిడ్డ. వీడే నా రాజ్యం ! నేను చేసినది అపరాధమైతే నన్ను శిక్షించండి." అన్నది.

రమ చెబుతున్న మాటలలో సభికులకు నమ్మకం కలగలేదు.

సీతారాం రమాదేవితో. "ప్రజలు నీ మాటలు నమ్మటంలేదు." అన్నాడు

ఈ మాటలు విని రమ కాస్సేపు తలవంచి కన్నీరు కార్చి. కళంకిని అనిపించు కుని తాను జీవించలే ననీ. తనకు చితి పేర్చిన ట్లయితే అందులో పడి కాలిపోతా ననీ అన్నది. తాను ఏదోషమూ చెయ్యలేదని తనభర్తపైనా, గురువైన చంద్ర చూడుడిపైనా. తనకు సర్వస్వమూ అయిన తన కొడుకుపైనా ప్రమాణాలు చేసింది. చివర కామె ఇంకేమీ చెప్పలేక మూర్ఛపడిపోయింది. తల్లిని చూసి ఏడుస్తున్న బిడ్డను తల్లిదగ్గిరికి తీసుకుపోయారు.

సభికులలో విపరీతమైన చైతన్యం పుట్టుకొచ్చింది కొందరు ఏడ్చారు కొందరు గంగారాంను చంపెయ్యమని అరిచారు. భటులు లా కోలాహాన్ని అణచలేకపోయారు.

సభికులు తనకు విరుద్ధంగా తయారవుతూండటం చూసి గంగారాం ఆత్మరక్షణకు గాను ఆఖరు అస్త్రం ప్రయోగించాడు.

మహారాజా, నా మనవి వినండి. ఆడవాళ్ళమాటలు నమ్ముతారా ? మీ రాజ్యాన్ని స్థాపించింది మావంటివాళ్ళ బాహుబలంగాని, స్త్రీలు కారే! ఆడవారు తమ దుశ్ప్రవర్తనను కప్పిపుచ్చుకోవటానికి ఎన్ని అబద్ధాలైనా ఆడతారు. మహారాణి రాత్రివేళ మరెవరినో పిలిపిస్తూ ఉండవచ్చు, ఆ దోషం నాపైన..." అంటూ గంగారాం అర్ధోక్తిలో ఆగిపోయి, గడగడా వణికిపోతూ, "మహారాజా, రక్షించడి! రక్షించండి!" అని కేకబెట్టి, కొయ్యబారిపోయాడు.

అత నిలా కావటానికి కారణం జయంతి ఆమె త్రిశూలం ధరించి, భైరవీ రూపంలో సభలోకి ప్రవేశించింది సభ అంతా ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది

జయంతి జనంమధ్యగా గంగారాంవద్దకు వచ్చి తన చేతిలోని త్రిశూలం అతని గుండెకు ఆన్చిపెట్టి, "ఏమంటున్నావు? ఇప్పుడు చెప్పు!" అన్నది.

త్రిశూలం తగలగానే గంగారాం ధైర్యమంతా సిగజారిపోయింది అతను సభవారికి జరిగినదంతా జరిగినట్టుగా చెప్పేశాడు. అతను తన ద్రోహమంతా తన నోటనే చెప్పి ముగించగానే జయంతి తిరిగి వచ్చినదారినే వెళ్ళిపోయింది

సీతారాం అతనికి మరణశిక్ష విధించాడు రాజభటు లతన్ని తీసుకుపోయారు. సభికులు మౌనంగా తమ ఇళ్ళకు వెళ్ళిపోయారు రమాదేవి నిష్కళంక అన్న సంగతి లోకానికి వెళ్ళడి అయింది.

## 2

గంగారాంను కొరత వేయవలసిఉంది అయితే సీతారాం రాజ్యాభిషేకానికి సన్నాహాలు జరుగుతూఉండటంచేత ఆ శిక్ష కొంతకాలం నిలుపు చేయబడింది శిక్షకు వాయిదా వేయమని నంద, చంద్రచూడుడూ సలహా ఇచ్చారన్నమాట అటుంచి, గంగారాం శ్రీకి అన్నకావటం సీతారాంకే అంత ఇష్టంలేదు. అయన శ్రీని ఇంకా మరచిపోలేదు.

పట్టాభిషేకోత్సవం దగ్గరపడుతున్నకొద్దీ నగరంలో జనసమ్మర్దం పెరిగింది. ఎక్కడెక్కడినుంచో ఆహూతులూ, భిచ్చగాళ్ళూ, సన్యాసులూ, సాధువులూ వచ్చి పడుతూన్నారు సంతర్పణలూ, నృత్య గీత వాద్యాలూ జోరుగా సాగుతూన్నాయి. పట్టాభిషేకంనాడు సీతారామరాయలు రోజల్లా రకరకాల దానాలు చేస్తూనేఉన్నాడు.

చివర కతను అలిసిపోయి. ఆ పని ఇతరులకు అప్పగించి, విశ్రాంతి తీసుకుందా మని అంతఃపురానికి బయలుదేరాడు

అంతఃపురద్వారంవద్ద త్రిశూలంతో భైరవీరూపంలో జయంతి నిలబడిఉన్నది. సీతారాం ఆమెకు నమస్కరించి "తల్లీ, నీ వెవరు ?" అని అడిగాడు.

"బిచ్చగత్తెను భిక్షకోసం వచ్చాను." అన్నది జయంతి.

"అమ్మా, నీకు ఏమిస్తే రుణం తీరుతుంది ? ఒకసారి రాజ్యాన్ని కాపాడావు. మరొకసారి నా వంశగౌరవాన్ని నిలబెట్టావు ఏం కావాలో సెలవియ్యి"

"గంగారాం ప్రాణభిక్ష కావాలి"

"గంగారాంవంటి అధముడిపై నీ కెలా దయగలిగింది ?"

"నా కందరూ సమానమే నా కారణంగా అతనికి శిక్షపడింది గనక నేనే అతని ప్రాణభిక్ష వేడుతున్నాను లేకపోతే అతనిచావు నా మెడకు చుట్టుకుంటుంది"

"నీవు కోరినట్టే కానియ్యి. కాని నీకు భిక్షపెట్టే అర్హత నాకులేదు గంగారాం ప్రాణాలను విక్రయిస్తాను ఆనాడు ఫిరంగివద్ద నా ప్రాణాన్ని నా కిస్తానన్నావు. దాన్ని నా కిస్తే నేను నీకు గంగారాం ప్రాణా లిస్తాను"

"మహారాజా, అంతఃపురద్వారాలను తెరిచిఉంచు. త్రిశూలం చూపినవారిని లోపలికి పోనిచ్చేటట్టు నీ ద్వారపాలకుల కందరికీ ఉత్తరువు లియ్యి. నీ ప్రాణం నీ పడకటింటికే వస్తుంది గంగారాంను విడిచిపెట్టమని ఆజ్ఞాపించు"

సీతారాం సరే నన్నాడు జయంతి గంగారాంను విడిపించటానికి కారాగృహానికి వెళ్ళిపోయింది. అక్కడ గంగారాం మేలుకునే ఉన్నాడు తనకు కొరత శిక్ష విధించినట్టు విన్న తరవాత అతను నిద్రపోలేదు

అర్ధరాత్రివేళ జైలుతలుపు తెరిచిన చప్పు డయింది. గంగారాం ప్రాణా లెగిరి పోతున్నట్టయింది దీపాలతో రాజభటులు లోపలికి వచ్చారు. గంగారాం కొయ్యబారిపోయి వాళ్ళకేసి నిలువుగుడ్లు పెట్టుకు చూడసాగాడు

అంతలోనే జయంతి లోపలికి వచ్చింది గంగారాం కెవ్వున అరిచి, "రక్షించు, రక్షించు ! నే నేం అపరాధం చేశాను ?" అని ఆక్రందన చేశాడు.

"ఏం చేశావో నీకు తెలుసు అయినా నిన్ను రక్షిస్తాను. శ్రీ జ్ఞాపకం ఉందా ?" అని జయంతి అడిగింది

"శ్రీ బతికి ఉందా ?"

"బతికేఉంది ఆమె కోరికమీదనే మహారాజును నీ ప్రాణభిక్ష వేడాను. ఆయన సరే నన్నారు. తెల్లవారినాక ఈ రాజ్యంలో నీ మొహం కనబడిందో నీ ప్రాణాలకు నేను పూచీకాను"

రాజభటులు అతని సంకెళ్ళు ఊడదీశారు గంగారాం వరిగెత్తుకుంటూ వెళ్ళి పోయాడు.

జయంతి వెళ్ళిపోయాక అంతఃపురద్వారా లన్నీ తెరిచిఉంచమని ఆజ్ఞాపించి, సీతారాం తన శయనమందిరానికి వెళ్లాడు.

సీతారాం శ్రీకోసం మేలుకుని కూర్చున్నాడు అపరాత్రి కావటంచేతనో, బడలిక ములానో సీతారాంకు క్షణంపాటు మాగన్ను పడింది. అతను ఉలిక్కిపడి కళ్ళుతెరచి చూసేసరికి ఎదురుగా శ్రీ పసుపుపచ్చని బట్టలూ, రుద్రాక్షమాలలూ ధరించి, తల విరబోసుకుని నిలబడిఉన్నది మొదట సీతారాం ఆమెను చూసి జయంతి అనుకుని, "శ్రీ ఏదీ ?" అని అడిగాడు

"నేనే శ్రీని," అన్నది శ్రీ

"నా శ్రీయే!" అంటూ సీతారాం తలతిరిగి పక్కమీద పడిపోయాడు మరు క్షణమే అతను మళ్ళీ కళ్ళు తెరచి, "నా శ్రీయే!" అనుకున్నాడు అయితే పరికించి చూడగా ఆమె ఎవరో దేవిలా గుండిగాని, శ్రీ లాగా లేదు

అత నామెతో త నామెకోసం ఎంతగా వెతికిందీ చెప్పాడు శ్రీ తన విషయాలు కొన్నిమాత్రమే అతనికి చెప్పింది.

"ఇప్పుడు న న్నేం చేస్తారు ?" అని ఆమె అడిగింది

"ఐదుసంవత్సరాలుగా నీకోసం వెతుకుతున్నాను. నాకు పట్టపురాణిగా ఉండు."

"ఒకప్పు డా పదవి వైకుంఠంలో లక్ష్మీదేవిలాటి దనుకున్నాను కాని ఆ రోజులు పోయాయి."

"ఎందుకు పోయాయి ?"

"నేను సమస్తమూ త్యజించిన సన్యాసిని "

"భర్త ఉండగా స్త్రీకి సన్యాసాధికారం లేదు "

"నేను సర్వ కర్మ పరిత్యాగం చేశాను. పతిసేవ నాకు ధర్మంకాదు "

సర్వకర్మ పరిత్యాగం ఎవరూ చెయ్యలేరు మీ అన్న ప్రాణాలు కోరటం కర్మ కాదా ? ఇక్కడికి రావటం కర్మకాదా ?"

"అవును నా సన్యాసం అందుచేత భ్రష్టమైపోయింది అది శాశ్వతంగా భ్రష్టం కావా లంటారా ?"

"భర్తతో కాపరం చెయ్యటం అధర్మ మని ఎవరు నీకు చెప్పారు ? నేను ని న్నిక్కడ బలాత్కారంగా ఉంచబోతున్నా."

"మీ అనుజ్ఞ లేకుండా నేను పోబోవటం లేదు "



"నీమీద ప్రేమచేత నిన్ను నేను వదిలిపోలే నని చెప్పరాదా?"

"ఆ భ్రాంతి ఇప్పుడు నాకు లేదు ప్రేమించటం ధర్మం అందులో సుఖ మున్నది కాని ప్రేమించబడటంలో ఏ మున్నది? మట్టిబొమ్మను దేవు డని పూజించేవాడిది సుఖం మట్టిబొమ్మ కేమున్నది?"

శ్రీ యీ వేదాంతం ఏ దొంగ సన్యాసినుంచో నేర్చుకున్నదని సీతారాంకు అని పించింది. "నాతో కలిసిఉండటమే నీకు నిజమైన ధర్మం. నిన్ను నా భార్యలాగా అనువర్తింపజేసుకోవటం నా కర్తవ్యం. నేను నిన్ను పోనివ్వను." అన్నా డతను.

"భర్తగా, రాజుగా, ఉపకారిగా నన్ను మీ రాజ్ఞాపించవచ్చు: కాని నావల్ల మీ కేమీ సుఖ ముండదు "

"నిన్ను చూడటమే నా కానందం "

"నన్ను బలవంతంగా ఉంచేయ దలిస్తే ఈ రాజాంతఃపురంలో వద్దు ఇక్కడ ఉండటం నాకు సాధ్యంకాదు అదీగాక నా మూలాన మీరు నవ్వులపా లవుతారు నేను సన్యాసినిని నాకోసం ఒక కుటీరం ఏర్పాటు చెయ్యండి "

"పట్టపురాణిని కుటీరంలో ఉంచితే ఎవరూ నవ్వరా ?"

"పట్టపురాణి అని ఎవరికీ తెలీదు "

"నేను నిన్ను చూడరావచ్చునా ?"

"మీ యిష్టం "

"నేను వచ్చి నిన్ను చూసి మాట్లాడిపోతుంటే జను లేమనుకుంటారో తెలుసా."

"మహారాజుగారి ఉంపుడుగత్తె అనుకుంటారు. అనుకుంటేనేం ? నాకు మానావ మానాలు లేవు. అవి మీ చేతిలో ఉన్నాయి "

"అదెలా ?"

"నన్ను మీ రంటరాదు "

"నేను ప్రభువును ! నా యిష్టం !"

"మీకు బలం ఉంటే, నా దగ్గర విష మున్నది "

ఆమెలో శ్రీ లక్షణా లేవీ కనిపించటం లేదు సీతారాం తన హృదయాధి దేవతగా ఆరాధించే శ్రీ మరొక విధంగా ఉన్నది; కాని అతను తన మనసులో ఉన్న శ్రీ నే తన వెలపలకూడా చూడ యత్నించాడు అత నామెకోసం చిత్త విశ్రామం అనే పేరుతో ఒక అందమైన భవనం కట్టించాడు. అతను రోజూ అక్క డికి వెళ్ళి, కొంతసేపు ఆమె కెదురుగా కూర్చుని, ఆమెకోసం తాను పడిన తాపమంతా వర్ణించి చెప్పి, తిరిగి వస్తుండేవాడు ఆమెకు ఎడంగా కూర్చుని మాట్లాడటం అతనికి చాలా బాధగా ఉండేది శ్రీ వెనకటికన్నకూడా ఎంతో అందంగానూ, ఆకర్షవంతంగానూ ఉన్నది. ఆమెకోసం సీతారాం శరీరం దహిం చుకుపోతున్నది ఆరని జ్వాలలలో అతను క్రమంగా బూడిద అయిపోతున్నాడు.

మొదట్లో సీతారాం సాయంత్రంపూట వచ్చి కొద్దిసేపు శ్రీ తో మాట్లాడి వెళ్ళిపోయేవాడు. క్రమంగా అతను రాత్రి పొద్దుపోయినదాకా ఉండసాగాడు. అందు

చేత అతను రాత్రిళ్ళు చిత్తవిశ్రామంలోనే భోజనం చేసి, పడుకునేటందు కేర్పాట్లు చేసుకున్నాడు. కాని అతను శ్రీ పడుకున్న గదిలో పడుకోవటానికి వీల్లేదు అందుచేత అతని కోరిక సఫలం కాలేదు. రానురాను అతను చిత్తవిశ్రామం నుంచి కదలటమే మానేశాడు తనకోసం అక్కడి కెవ్వరూ రాగూడదని ఉత్తరువు చేశాడు. రాజకార్యా లేమవుతున్నాయో కూడా అతనికి తెలియకుండాపోయింది

రాజును గురించి ఊళ్ళో రకరకాల పుకార్లు బయలుదేరాయి ఆయనను ఎవరో భైరవి వశీకరించుకున్నది, ఆమె ఢాకిని అనీ, మంత్రపాదుకలు ధరించి ఆకాశం లోకి ఎగిరిపోగలదనీ కట్టుకథలు పుట్టాయి ఈ పుకార్లకు తోడు నవాబుసేన వచ్చిపడుతున్నట్టు వార్తలు వచ్చాయి

"మీరు అస్తమానమూ నా కెదురుగానే కూర్చుంటే మీరు స్థాపించిన హిందూ రాజ్యాన్ని ఎవరు రక్షిస్తారు?" అని శ్రీ సీతారాం నడిగింది

"రాజ్యానికి వచ్చిన ప్రమాద మేమీ లేదు," అన్నాడు సీతారాం

"భూషణనగరాన్ని పోగొట్టుకున్న నవాబు చూస్తూ ఊరుకుంటాడా? ముర్షిదా బాదనుంచి సమాచారా లేమైనా తెలుస్తున్నాయా?"

"ముర్షిదాబాదు కాదు, వాళ్ళకు కావలసింది శిస్తుసొమ్ము"

"అదైనా సక్రమంగా వెళుతున్నదా?"

"ఈసారిమాత్రమే పోలేదు. ఖర్చు జాస్తి అయింది"

"అందువల్ల ఫలితం ఏమిటో విచారించారా?"

"శ్రీ, నిన్ను చూస్తూ సమస్తమూ మరిచిపోతున్నాను"

"అయితే నేను మీ ఎదటినుంచి పోతాను అరణ్యానికి వెళ్ళిపోనివ్వండి"

"ఎలా అయితే అలా కానీ. నేనుకూడా బాగా ఆలోచించిచూశాను: విడిస్తే నిన్ను విడవాలి, లేదా రాజ్యాన్ని విడవాలి నిన్ను విడవలేనుగనుక రాజ్యాన్ని విడిచేస్తాను."

"అలాగే చెయ్యండి రాజ్యభారం ఎవరికైనా అప్పగించి సన్యాసం స్వీకరించి నావెంట అరణ్యానికి రండి."

ఈమాట వినేసరికి సీతారాంకు గుబులు పుట్టుకొచ్చింది రాజ్యభోగాలకు బాగా అలవాటు పడిపోయాడు ఇప్పుడు వాటిని విడనాడలేడు రాజ్యత్యాగం చెయ్యటం అతనికి సాధ్య మయే పనిగాదు. అతనికి శ్రీ కావాలి, రాజ్యమూ కావాలి.

## 3

గంగారాం విచారణ జరిగేటప్పుడు సాక్ష్యం చెప్పి, నిండుసభలో మూర్ఛపోయిన రమ అలాగే మంచం పట్టిపోయింది అస్థానవైద్యులే గాక పైవా ళ్ళెందరో వచ్చి

రమకు చికిత్స చేస్తున్నారు ఆమె ఏ వ్యాధితో బాధపడుతున్నదీ ఎవరికీ తెలియదు. అందరూ ఆ వ్యాధికి తలా ఒక పేరూ పెట్టారు.

రమ కృశించిపోవటం చూసి నంద భయపడింది ఆమె ఆస్థాన వైద్యుణ్ణి పిలిపించి, "మీరు జీతా లెందుకు పుచ్చుకుంటున్నారు? చిన్నరాణికి వ్యాధి ఎందుకు తగ్గదు?" అని అడిగింది

పెద్దరాణి ఈ మాటలకు వైద్యులు చాలా కలవరపడ్డారు ఒక వృద్ధవైద్యుడు నందతో, "అమ్మా, నాకు మూడురోజు లివ్వండి నేను చికిత్సచేస్తాను కాని ఒక్క షరతు చిన్నరాణి నా ఎదట ఔషధం తీసుకోవాలి," అన్నాడు

చిన్నరాణి తమ ఔషధాలను తీసుకోవటం లేదనీ, తీసుకుంటే వ్యాధి ఇలా ముదిరి ఉండదనీ ఆయన అన్నాడు

నంద రమవద్దకు వెళ్ళి వైద్యు డన్నమాటలు చెప్పింది రమ నవ్వింది

"నవ్వుతావేం?"

"నేను ఎన్నడూ ఔషధాలు తీసుకోనేలేదు పక్కకింద చూసుకో"

నందాదేవి పక్క ఎత్తి దానికింద ఉన్న మందులు చూసి, "ఇదేమిటి, రమా? ఆత్మహత్య చేసుకుంటావా?" అన్నది.

"లేదు; రాజుగారు నన్ను చూడటానికి వస్తే మందు తీసుకుంటాను"

కాని నందకే రాజు దర్శనం అందటంలేదు

ఒకరోజు సీతారాం నందకు కనిపించాడు

"రమను మీ రివాళ చూడకపోతే ఇంక మరి చూడలేరు," అన్న దామె

తప్పనిసరి అయి సీతారాం రమవద్దకు వెళ్ళాడు ఆమె అతన్ని చూసి చాలాసేపు ఏడ్చింది. అతను విసుక్కోక, ప్రేమగానే, "భయపడకు, నీకు త్వరలోనే ఆరోగ్యం చేకూరుతుంది," అన్నాడు

రమ ఆ మాటలకు తృప్తిగా చిరునవ్వు నవ్వింది ఆ నవ్వు చూస్తూనే, ఆమె బతకదని సీతారాం తెలుసుకున్నాడు రమకొడుకు అక్కడికి వచ్చాడు వాణ్ణి ఎత్తుకోమని రమ భర్తను కోరింది సీతారాం వాణ్ణి ఎత్తుకున్నాడు

"ఇంక నేను పోతాను నాకిక సెలవిప్పించండి." అంటూ రమ ప్రాణాలు వదిలింది

రమను ఒకప్పుడు సీతారాం అందరికన్న ఎక్కువగా ప్రేమించాడు ఆ ప్రేమ అంతా ఎలా పోయిందో, ఎందుకు పోయిందో అతనికి తెలియలేదు రమ చేసిన తప్పేమీ లేదు గనక తప్పంతా తనదే అయిఉండా లని అత నను కున్నాడు. రమ

పోవటంచేత అతని మనస్సు వికలమైపోయింది అలాటి మనస్సుతో శ్రీ ఎదటికి పోబుద్ధి పుట్టక, అతను నందవద్దకు వెళ్ళాడు

వా రిద్దరూ రమను గురించి మాట్లాడుకునేటప్పుడు నంద," మీ ఉపేక్షవల్లనే రమ చచ్చిపోయింది." అన్నది.

ఈ మాటకు సీతారాం మండిపడి, "అది నిజమే! మీ చావులకు నేనే కారణం నేను ప్రాణా లొడ్డి, రక్తం ఓడ్చి, రాజ్యం సంపాదించి మిమ్మల్ని రాణులను చేసి నాక ఆ మాట అనక ఇం కేమంటావు?" అని కేకలుపెట్టాడు

ఆ ఆగ్రహంలోనే అతను నంది ఇంటినుంచి బయలుదేరి చంద్రచూడుడి వద్దకు వెళ్ళాడు. చంద్రచూడుడు అతన్ని ఓదారుస్తూనే మధ్యలో, "మహారాజా, మీరు చిన్నరాణిగారి పట్ల సరిగా ప్రవర్తించినట్లయితే ఆమె జబ్బు నయమై ఉండేదే" అన్నాడు

మంటపై ఆజ్యం పోసిన ట్లయింది "చిన్నరాణి చావుకు నేనే కారణమని మీ ఉద్దేశం కూడానా?" అన్నాడు సీతారాం

"ఒక విధంగా అంతే అనుకోవాలి." అన్నాడు చంద్రచూడుడు

"నే నందరికీ చావు తెచ్చిపెట్టేవా ణ్ణయితే ఈ రాజ్యంలో జనం ఇంకా ఎందుకు బతికిఉన్నారు? అది కాస్త తెలుసుకోవాలి."

"మీరు చావు తెచ్చిపెట్టాలా? రక్షించవలసినవాళ్ళను రక్షించకపోతే చావు దానంతట అదే వస్తుంది. ఒక్క చిన్నరాణి ఏమిటి? పరిపాలన సరిగా లేకపోతే రాజ్యానికి కూడా అదేగతి పట్టుతుంది ఈ మాట చెప్పాలని చాలా కాలంగా చూస్తున్నారు.

"పరిపాలన నేను సరిగా చూడటం లేదే అనుకుందాం, మీ రంతా ఏం చేస్తున్నారు?"

"మా చేతనైనది మేం చేస్తూనే ఉన్నాం రాజాజ్ఞ లేకుండా జరగని పనులు మా వల్ల ఎలా అవుతాయి? రేపుదయం కొలువుకు దయచేస్తే అన్ని విషయాలూ చెబుతాను వాటికి సరిఅయిన ఉత్తరువులు ఇద్దురుగాని."

"సరే చూద్దాం." అన్నాడు సీతారాం చంద్రచూడుడు గురువని చూస్తుంటే మితిమీరిపోతున్నా డనీ, ఆయన కేదైనా తగిన శిక్ష వహాలనీ అతను తనలో అను కున్నాడు

మర్నాడు ఉదయం అతను సభకు రాగానే చంద్రచూడుడు అన్నివిషయాలూ చెప్పాడు

అన్నిటికన్న ముఖ్యమైన సంగతి — ఖజానాలో డబ్బులేదు ఢిల్లీ పాదుషాకు పంపవలసిన పేష్కష్ ఒక చిల్లిగవ్వకూడా ముర్షిదాబాదుకు ఇంతవరకు పోలేదు. ఉండటానికి మంచి రాబడిగల రాజ్యమే సీతారాంకింద ఉన్నది. కాని రాబడితోబాటు ఖర్చుకూడా హెచ్చింది భూషణనగరం పట్టుపకోటానికి కొంత డబ్బు ఖర్చయింది శత్రుభయం లేకుండా చూసుకోవటానికి సేనలను పెంచవలసివచ్చింది. దానితోబాటు ఖర్చు పెరిగింది పట్టాభిషేకోత్సవానికి అంతులేని ఖర్చయింది. దీనికి తోడు రాజుగారు పరిపాలన విషయాలు పట్టించుకోకపోవటంతో రాజోద్యోగు లంతా ఖజానాలోని సొమ్మును చిత్తం వచ్చినట్టు వాడేసీ, కాజేసీ, దొంగ లెక్కలు రాస్తున్నారు వాళ్ళదే రాజ్యం, అడిగేనాథుడు లేడు—చంద్రచూడుడు తప్ప కాని ఆయన అంటే ఎవరికీ లక్ష్యం లే దిప్పుడు అయిన సీతారాంతో రాజోద్యోగులను గురించి ఫిర్యాదు చేస్తే సీతారాం, "నీ యిష్టప్రకారం చేసెయ్యి," అని చెప్పి శ్రీ కెదురుగా కూర్చొబోయాడు

అవినీతిపరు లైన ఉద్యోగుఃను తొలగిస్తూ చంద్రచూడుడు ఉత్తరువులు వేశాడు. కాని ఆ ఉత్తరువులపై రాజముద్ర లేదు, వాటి నెవరూ ఖాతరు చెయ్య లెదు పై పెచ్చు వాళ్లు ఆయనతో, "స్వామీ మీ కీ రాజకీయగొడవలు దేనికి? హాయిగా ఇంటికి వెళ్ళి త్రికాలసంధ్యావందనం చేసుకుంటూ కూర్చోండి," అని యద్దేవాకూడా చేశారు

ఎలాగో కష్టపడి చంద్రచూడుడు తన ఉత్తరువులపై రాజముద్ర వేయించాడు: కాని రాజుగారు ఉత్తర్వులు చదవకుండానే ముద్ర వేశారనీ, ఆ వుత్తరువులు చెల్ల వనీ ఉద్యోగు లభ్యంతరం చెప్పారు పై పెచ్చు, ఇదిమొదలు వారు ధనాన్ని రెండు చేతులా కొల్లగొట్టసాగారు

చంద్రచూడుడు ఉద్యోగుల అవినీతి ప్రవర్తనను గురించి సీతారాంకు సభలో వెల్లడించాడు సీతారాం ఎవరి అవినీతిగురించీ ఎలాటి విచారణా చెయ్యకుండానే, "దుష్ప్రవర్తనకు పూనుకున్నవారి నందరినీ కొరత వేయించండి," అని ఆజ్ఞ ఇచ్చాడు

ఈ ఆజ్ఞ విని అందరూ వణికిపోయారు. చంద్రచూడుడుకూడా దిగ్భ్రాంతిచెందె. "ఇదేమిటి, మహారాజా? ఎవరిది ఎలాటి నేరమో విచారించకుండా అందరికీ ఒకటే శిక్షా?" అన్నాడు

సీతారాం కోపంతో చీదరించుకుంటూ, "నేరా లన్నిటికీ ఒకటే శిక్ష!" అన్నాడు

"కొందరు బ్రాహ్మణోద్యోగులుకూడా ఉన్నారు. బ్రహ్మహత్య ఎలా చేయటం?"

"బ్రాహ్మణు లుంటే వారిచెవులు కోయించి, దొంగల మొహాలమీద వేసినట్టుగా వాత పెట్టించండి మిగిలినవారిని కొరత వేయించండి," అంటూ సీతారాం లేచి చిత్తవిశ్రామానికి వెళ్ళిపోయాడు అవినీతిపరులైన రాజోద్యోగులకు శిక్షలు వడ్డాయి నగరమంతా అట్టుడికిపోయింది రాజోద్యోగులు రాజీనామాలు పెట్టేశారు.

పరిపాలనలో అవినీతి పోయింది గాని డబ్బు రాలేదు ఉన్న కష్టసుఖాలు వినిపించాలంటే రాజు అందడు చివరకు ఒకనాడు వీలు చిక్కించుకుని చంద్రచూడుడు సీతారాంతో, "మహారాజా, నే చెప్పేది వినకపోతే ఈ రాజ్యం నిలవదు." అన్నాడు.

"ఉంటే ఉంటుంది. ఊడితే ఊడుతుంది మీరు చెప్పే దేదో చెప్పండి." అన్నాడు సీతారాం.

"కోశంలో డబ్బులేదు జీతా లందక సైనికులు అధిక సంఖ్యలలో వెళ్ళిపోతున్నారు ".

"ఇంకా రాజధనం దోపిడి అవుతూనేఉందా ?"

"లేదు. కాని అదివరకు పోయినది రాదుగా !"

"పన్నులు వసూ లవుతున్నాయా ?"

"ఇచ్చేవా ళ్ళిస్తేగద ?"

"ఎందు కివ్వరు ?"

"మునల్మానులు వచ్చి ఆక్రమించుకోబోతున్నారని వారి నమ్మకం, ఇచ్చే దేదో వారికే ఇస్తామనీ, మీ కొకసారీ, వారి కొకసారీ ఎక్కడ ఇస్తామని అంటున్నారు."

"పన్నులు కట్టనివా ళ్ళందరినీ ఖైదు చేస్తేసరి "

"మహారాజా ! ఇంతమంది పట్టే కారాగృహం ఎక్కడుంది ?"

"పెద్దపెద్ద భవనాలు తీసుకుని కారాగృహాలుగా మార్చండి."

పన్ను లియ్యనివాళ్ళనూ, వసూలు చెయ్యనివాళ్ళనూ ఖైదులో ఉంచటాని కవసరమైన ఉత్తరువులపై సంతకం చేసి సీతారాం చిత్తవిశ్రామానికి వెళ్ళిపోయాడు

ఖైదులు నిండిపోయాయి. దేశంలో సంచలనం పుట్టింది. బాకీదారులూ, తహశీలుదారులూ దేశం విడిచి పారిపోతుంటే, వారితోబాటు పన్నులు బాకీలేనివారుకూడా పారిపోయారు.

సీతారాం ఇలా దిగజారిపోవటానికి కారణం శ్రీయే. శ్రీ రాకపోయినా, ఆమె మొదటినుంచీ పట్టమహిషిగా ఉండినా సీతారాం తన పరిపాలనను శ్రద్ధగా నడుపుకుని ఉండేవాడు. శ్రీ రావటమైతే వచ్చిందిగాని, భార్యగా రాక సన్యాసినిగా రావటం ప్రమాదం కలిగించింది.

చాలాకాలం సీతారాం తన మోహాన్ని నిగ్రహించి ఉంచాడుగాని. అతని నిగ్రహం సడలింది; అతనామెను బలాత్కారంగా పొంద నిశ్చయించాడు. దైవికంగా అతనా నిశ్చయం చేసుకున్ననాటి రాత్రి అతను చిత్తవిశ్రామానికి రావటం పడలేదు. చంద్రచూడు డతనితో, "మహారాజా, నేను తీర్థయాత్రలమీద పోదామనుకుంటున్నాను. తమ సెలవైతే బయలుదేరుతాను," అన్నాడు

ఈమాట సీతారాం నెత్తిమీద పిడుగులాగా అయింది అతను చంద్రచూడుడి ప్రయత్నం మాన్పించటానికి యత్నించాడు. చంద్రచూడుడి ప్రాణం విసిగిపోయి ఉన్నది. సీతారాం పాపాత్ముడనీ, అతనికింద పని చెయ్యరాదనీ ఆయన అదివరకే నిశ్చయించుకున్నాడు. అందుచేత ఆయన సీతారాం చెప్పేదాని కేదో ఒక అభ్యంతరం చెబుతూవచ్చాడు చిట్టచివరకు రాజు చెప్పినప్రకారం చంద్రచూడుడు తీర్థయాత్రలను వాయిదా వెయ్యటానికి సమ్మతించేసరికి చాలా రాత్రి గడిచింది. ఆనాడిక సీతారాం చిత్తవిశ్రామానికి వెళ్ళలేదు.

## 4

ఆ రాత్రే చిత్తవిశ్రామంలో ఒక అనుకోని సంఘటన జరిగింది అక్కడికి భైరవీవేషంలో జయంతి వచ్చింది

"మంచి సమయానికి వచ్చావు, నీ సలహా అవసరంగా కావాలి," అన్నది శ్రీ.

"ఎలా ఉన్నావో చూసిపోదామని వచ్చాను ఏం జరిగింది? రాజ్యం అస్తవ్యస్తంగా ఉందనీ, అందుకు నువే కారణమనీ విన్నాను," అన్నది జయంతి.

"అందుకే నువు రావటం మంచి దయింది," అంటూ శ్రీ జరిగిన దంతా ఆమెకు చెప్పింది.

"నీ కర్తవ్యం ను వెందుకు నెరవేర్చలేదు?"

"అ దేమిటో నాకు తెలిస్తే గద?"

రాజాంతఃపురానికి వెళ్ళి పట్టమహిషివిగా ఉండు అతనికి రాజకార్యాలలో ఆసక్తి కలిగించు."

"సన్యాసినిగా ఉండటం నేర్చుకున్నాను గాని పట్టమహిషిగా ఉండటం నేర్చుకోలేదు. తెలియనిపని చేసి ఏం లాభం? సన్యాసిని రాణి అవుతుందా?"

"అదీ నిజమే నీ కాపని నేతనై ఉంటే ఇంతదాకా రాదు ఇప్పు డేం చేద్దామని నీ ఉద్దేశం?"

"పారిపోవటం తప్ప మరొక మార్గం కనిపించటంలేదు. రాజ్యం మాటా, రాజు మాటా అటుంచి, నా బుద్ధి సన్యాసం మీదికీ, వనవాసం మీదికీ పోతున్నది.



మహారాజు అస్తమానమూ నన్ను తన భార్యగా మాత్రమే చూస్తున్నాడు." అన్నది శ్రీ.

"అలా గయితే ఇప్పుడే వెళ్లి "

"ఎలా పోవటం ? ద్వారపాలకులు పోనివ్వరు "

''భైరవీ వేషం వేసుకుని వెళ్ళు ఎవరూ నిన్నాపరు. నా శాటీ, రుద్రాక్షలూ, త్రిశూలమూ తీసుకో "

"తరవాత నువ్వెలా బయటపడతావు ?"

"బయట పడలేకపోతే ఇక్కడే ఉంటాను నీ ఇష్ట మేమిటి ?"

''సరే. మళ్ళీ నిన్నెక్కడ కలుసుకోను ?''

"నెట్టిగ అనే గ్రామంలో రాజపురోహితుణ్ణి చూడు ఆయన నా శిష్యుడు నిన్నాయన రహస్యమైన చోట ఉంచుతాడు నేను వచ్చి నిన్నక్కడ కలుసుకుంటాను.

శ్రీ భైరవి వేషం వేసుకుని వెళ్ళిపోయింది ద్వారపాలకు లామెను అడ్డలేదు. రాజుగారిని పట్టిన ఢాకిని పారిపోయిందని వదంతి పుట్టింది. ఢాకిని వెళ్ళిపోయినందుకు రాజు మనస్తాపం చెందుతున్నాడని అందరూ అనుకున్నారు ఎందుచేతనంటే శ్రీ వెళ్ళిపోయినందుకు చిత్తవిశ్రామ ద్వారపాలకులనూ, పరిచారికలనూ సీతారాం చెరసాలలో పెట్టించాడు అతను ఆమెకోసం వెతకటానికి మనుషులను

అన్ని వైపులకూ పంపి, ఆమె దొరకలేదని చెప్పినవారినికూడా చెరసాలలో పెట్టించాడు. అతను ఎవరినీ దగ్గిరికి రానివ్వలేదు. చంద్రచూడుణ్ణి సైతం నానామాటలూ అన్నాడు.

చిత్తవిభ్రామంలో సీతారాంకు జయంతి దొరికింది. అత నామెను చెరసాలలో పెట్టించి, ఆమెను నగ్నంగా చేసి బెత్తంతో కొట్టించేలాగు శిక్ష విధించాడు. ఆమె దేవత ! ఆమె నిలా శిక్షించటం ఘోరం !" అని చెప్పవచ్చినవారితో అతను, "ఆమె దేవత అయితే ఆమె తనను తాను రక్షించుకోగలదు. మీ మధ్యవర్తిత్వం అనవసరం; ఆమె మనిషే అయితే అమె చేసిన నేరానికి నేను శిక్షించి తీరాలి," అన్నాడు

భైరవిని శిక్షిస్తారని ముందుగానే దండోరావేసిన కారణంచేత ఆరోజు తెల్లవారుజామునుంచీ జనం తండోపతండాలుగా కోటలోని విశాల ప్రాంగణంలోకి వచ్చి చేరసాగారు. ప్రాంగణం మధ్య ఎత్తుగా మంచవేసి దానికి మెట్లు అమర్చారు.

మంచె కెదురుగా రాజుకోసం సింహాసనం వేశారు సీతారాం వచ్చి దాని మీద కూర్చున్నప్పుడు జనంలోనుంచి జయధ్వానా లేవీ వెలువడలేదు రాజభటులు జయంతిని తీసుకువచ్చినప్పుడుమాత్రం జనం, "జగన్మాతకూ జై ! లక్ష్మి మహాదేవికీ జై !" అని కేకలు పెట్టారు. ఆ నినాదాలు వినేసరికి, మంచెపై నిలబడి ఉన్న చండాలుడి చేతినుంచి బెత్తం జారి కిందపడింది.

"ఆమె చీర లాగెయ్యి ! బెత్తంతో కొట్టు !" అని సీతారాం చండాలుణ్ణి ఆజ్ఞాపించాడు.

చండాలుడు కిందపడిన బెత్తం తీసి, ఒకసారి రాజునూ, ఒకసారి జయంతినీ చూసి బెత్తం దూరంగా పారేశాడు

"చండాలుణ్ణి తీసుకుపోయి కారాగృహంలో పెట్టండి," అన్నాడు రాజు.

"నాయనా, నా కోసం నీ వెందుకు కష్టాలపా లవుతావు. నాకు సుఖ దుఃఖాలు రెండూ సమానమే. చూడు !" అంటూ ఆమె బెత్తం తీసుకుని చేతిపైనే బలంగా కొట్టుకున్నది. దెబ్బవెంట రక్తం వచ్చింది. చండాలు డది చూసి బెదురుతూ, వెనక్కు తిరిగి మెట్లమీదుగా మంచెదిగి పారిపోయాడు. జనం హా హా కారాలు చేశారు. చండాలు డా జనంలో కలిసిపోయాడు.

ఈసారి సీతారాం ఒక ముసల్మాను కటికవాణ్ణి తెప్పించాడు. ఆ కటికవాడు రాజాజ్ఞపైన బెత్తంతో మంచెమీదికి వచ్చి, "బట్ట విప్పెయ్యి !" అని గర్జించాడు.



సరిగా ఆ సమయానికి నందాదేవి అక్కడికి వచ్చింది. ఆమెవెంట అనేకమంది పౌరస్త్రీలు వచ్చారు. నంద మంచపైకి ఎక్కి, "మహారాజా, నేను ప్రాణాలతో ఉండగా ఇలాటి పాపకృత్యం జరిగనివ్వను." అన్నది.

"నీ వికక్కడ దేనికి ? అంతఃపురానికి వెళ్ళిపో !" అన్నాడు సీతారాం

"ఈ కటికవాణ్ణి మంచెమీదినుంచి ఈడ్చిపారెయ్యగల మగవా ళ్ళిక్కడ లేరా?" అంది నంద వెంటనే జనంలో తీవ్రసంచలనం పుట్టింది. "కొట్టు ! చంపు !" అని అనేకవేలమంది కటికవాడిపైకి రాబోయారు. కటికవాడు కిందికిదూకి పారిపోజూచాడు గాని, జనం వాణ్ణి పట్టుకుని కోటబయటి కీడ్చుకుపోయి, చావదన్ని విడిచిపెట్టారు.

నంద జయంతిని తన అంతఃపురానికి ఆహ్వానించి తీసుకుపోయింది. సీతారాం ఏమీ చెయ్యలేక, ఆసనంనుంచి లేచి వెళ్ళిపోయాడు. జయంతి అంతఃపురంలో నందాదేవి చేసిన మర్యాదలు స్వీకరించి, తన దారిన తాను వెళ్ళిపోయింది.

సీతారాం పూర్తిగా పాశవశక్తుల వాత పడిపోయాడు అతను చిత్తవిశ్రామంలో ఒంటరిగా ఉంటూ, నగరంలోని అందగత్తెలను పట్టుకురమ్మని నీచులైన తన అనుచరులకు ఆజ్ఞాపించాడు. వా రలాగే చేయసాగారు.

జయంతి సీతారాంను ఉద్ధరించాలనే ఉద్దేశంతో ఉన్నది అందుకై శ్రీని తీసుకు రావాలి. ఈ ఉద్దేశంతో ఆమె శ్రీ ఉన్నచోటికి చేరుకుని ఆమెకు సమస్తమూ చెప్పింది.

"అయన అంత అధోగతికి దిగజారిపోయాడా ? ఆయనను ఉద్ధరించే మార్గం లేదా ?" అని శ్రీ అడిగింది.

ఒకటేమార్గం – భగవంతు డనుగ్రహించాలి. అతను భగవంతుణ్ణి పూర్తిగా మరిచిపోయినట్టు కనబడుతూంది." అన్నది జయంతి.

జయంతి శ్రీని సీతారాంవద్దకు వెళ్ళటానికి ఎలాగో ఒప్పించింది.

ఈ లోపుగా సీతారాం పరిస్థితి విషమస్థాయి నందుకున్నది. అతని కిప్పు డెవరు లేరు. శ్రీ వెళ్ళిపోయింది. జయంతి వెళ్ళిపోయింది. చంద్రచూడుడు వెళ్ళిపోయాడు. చాంద్‌షా ఫకీరుకూడా వెళ్ళిపోయాడు. అతని తరపువాళ్ళు కోటలో నందాదేవీ, మృణ్మయుడూ మాత్రమే మిగిలారు.

ఒకనాటి ఉదయం ముసల్మాను సైన్యాలు కోటను ముట్టడించాయి. ముసల్మానులు వస్తున్నారని ముందుగా చెప్పటానికి చంద్రచూడుడి చారులు లేనందున మృణ్మయుడు ఎలాటి యుద్ధప్రయత్నమూ చేసిఉండలేదు. శత్రువుల స్థితిగతులను తెలుసుకోవడానికై మృణ్మయుడు కోట దాటి అడుగుపెట్టగానే ముసల్మాను లతనిని చంపేశారు.

మృణ్మయుడి మరణవార్త చిత్తవిశ్రామంలో ఆడవాళ్ళమధ్య ఉన్న సీతారాంకు తెలిసింది. అతను లేచి బయలుదేరాడు.

సీతారాం గుర్రమెక్కి కోటలోకి వెళ్ళాడు. ముసల్మాను లింకా కోటలోకి ప్రవేశించలేదు. కోటద్వారంకేసి వారి సేన రావటం కనిపించింది. అతను కోటద్వారం మూయించి కోట అంతా తిరిగి చూశాడు. సైనికు డొక్కడుకూడా లేడు. జీతాలు ముట్టక అందరూ అదివరకే వెళ్ళిపోయారు. కొందరు బ్రాహ్మణులూ, రాజుగారి మీద ఆధారపడి బతుకుతున్నవారూ, అంతా కలిసి ఒక యాభైమంది మాత్రమే, కోటలో ఇంకా మిగిలారు.

"నేను చాలా పాపం చేశాను. ప్రాణాలు విడవటమే దానికి ప్రాయశ్చిత్తం." అనుకుంటూ సీతారాం అంతఃపురానికి వెళ్ళాడు. అంతఃపురం నిర్జనంగా ఉండి బావురు మంటున్నది.

ముసల్మానులు కోటగోడను ఛేదించటానికి ఫిరంగులు పేల్చటం ప్రారంభించారు.

సీతారాం నందాదేవి ఉండే భవనానికి వెళ్ళేసరికి ఆమె పొర్లిగింతలుపెట్టి ఏడుస్తున్నది. ఆమెపిల్లలూ, రమకొడుకూ కూడా అక్కడే ఉన్నారు.

"మహారాజా, ఎంతపని చేశారు!" అన్నది నంద.

"రాసిపెట్టి ఉన్నట్టే చేశాను. మొదలే మొగుడికి ప్రాణగండ మైనదాన్ని పెళ్ళాడాను. దానిమూలానే సర్వనాశన మయింది." అన్నాడు సీతారాం.



"మహారాజా, విచారించకండి. చావు అందరికీ ఉన్నదే. సైన్యంతో వెళ్ళి శత్రువుతో పోరండి."

"సైన్యం ఎక్కడ? అంతా కలిసి నూరుమందిలేరు. నేను శత్రువుల మధ్యకు ఒంటరిగానే వెళ్ళి చచ్చిపోతాను ఈమాట నీకు చెప్పి, ఆయుధాలు తీసుకు పోదామని వచ్చాను."

నంద కన్నీరు కారుస్తూ, "మహారాజా, మీరు మరణిస్తారు. నేను మీతో సహగమనం చేస్తాను. తరవాత నోరులేని ఈ బిడ్డలగతి ఏమిటి? ముసల్మానులు వీళ్ళని బతకనిస్తారా?"

"అందుచేత నువు చావగూడదు వీళ్ళకోసం బతికిఉండు."

సీతారాం యుద్ధపుదుస్తులు ధరించి, ఆయుధాలు తీసుకుని బయలుదేరాడు. అతను అంతఃపురం దాటి వెళుతూండగా, మంచెమీద ఇద్దరాడవాళ్ళు కూర్చునిఉండటం కనిపించింది; దగ్గిరికి వెళ్ళి, భైరవీవేషంలో ఉన్న జయంతినీ, శ్రీనీ గుర్తించాడు.

"మీరు చెయ్యదలచిన దింకా పూర్తికాలేదా? నా తుదిఘడియలలో మళ్ళీ ఏం వచ్చారు?" అన్నాడు సీతారాం.

జయంతి నవ్వింది. శ్రీ కంటనీరు గార్చుతూ మాట్లాడలేకపోయింది.

"శ్రీ, నీ జాతకం నిజమయింది. నాకు చావు దగ్గిరపడింది. ఎందుకు వచ్చావు?"

"మీతోబాటు చావటానికి," అన్నది శ్రీ.

"సన్యాసినులు సహగమనం చేస్తారా ?"

"చావటానికి అందరికీ సమానహక్కున్నది."

"నీ సన్యాసినీ ధర్మం నువు చూసుకో నాతో సహగమనం చెయ్యటానికి నంద ఉన్నదిలే."

'నాపైన ఎన్నడూ కోప్పడలేదు, ఇప్పు డెందుకు కోప్పడతారు? నే నిక సన్యాసినివి కాను, నన్ను పరిగ్రహించండి." అంటూ శ్రీ అతని కాళ్ళపైన పడింది.

"ఎంతో సంతోషంగా పరిగ్రహించిఉందును, కాని ఇది సమయంకాదు"

"నేను స్వేచ్ఛగా మరణించే సమయం ఇదే."

"నీవే నా పట్టపురాణివి !"

జయంతి వా రిద్దరినీ, "విజయోస్తు !" అని దీవించింది.

సీతారాం ఆమెకు క్షమాపణ చెప్పుకున్నాడు.

"మహారాజా, మీతోపాటు నందాదేవీ. నేనూ ప్రాణాలు విడవగలం కాని పిల్లలను కాపాడటానికి ఉపాయం లేదా ?" అని శ్రీ అడిగింది.

"ఏమీ ఉపాయంలేదు ఏం చెయ్యను" అన్నాడు సీతారాం.

"ఏ ఉపాయమూ లేనివాళికి ఆఖరుఉపాయం ఉన్నదని తెలీదా ? లేక ఐశ్వర్య గర్వంలో మరిచావా ? అనాధరక్షకుడు జ్ఞాపకం రావటంలేదా ?" అని జయంతి అడిగింది.

సీతారాం తెల్లబోయాడు అతను భగవంతుణ్ణి స్మరించి చాలాకాల మయింది అత నిప్పుడు భగవధ్యానం చెయ్యసాగాడు. మంచెపైన మోకరించి జయంతీ, శ్రీ కూడా భగవన్నామం పఠించారు.

## 5

వెళ్ళిపోయిన సైనికులు వెళ్ళిపోగా కోటలో యాభై మంది యువకులు రాజా కోసం ప్రాణా లర్పించటానికి సిద్ధంగా ఉండి ముసల్మానులతో యుద్ధం చేయగోరుతున్నారు.

వాళ్ళలో రఘువీరు డనేవాడు మిగిలినవాళ్ళతో, "ముసల్మాను లెలాగూ కోటలో ప్రవేశిస్తారు మనని చంపేస్తారు. అలా చావటమా ? శత్రువు నెదిరించి పోరాడుతూ వీరోచితంగా చావటమా ? పదండి, యుద్ధం చెయ్యమని రాజుగారు మనని ఆజ్ఞాపించాలా ? వీరమరణానికి నడవండి !" అని ఉద్బోధించాడు.



అందరూ "మహారాజుకు జై!" అని కేకలు పెడుతూ సీతారాంవద్దకు వచ్చారు.

సీతారాం వాళ్ళను చూసి, అక్కడే ఉండమని చెప్పి, అంతఃపురంలోకి వెళ్ళి, నందాదేవినీ పిల్లలనూ ఒక పల్లకిలో ఎక్కించి తీసుకువచ్చాడు. తరవాత అతను తనకున్న కొద్దిమంది సైనికులతో ఒక సూచీవ్యూహం అమర్చాడు. సూదిబెజ్జం స్థానంలో నందాదేవి ఎక్కిన పల్లకీ నుంచి, దానిముందు తాను నిలబడ్డాడు. అతను జయంతినీ, శ్రీనీ పల్లకి సమీపంలోకి రమ్మంటే వాళ్ళు రాక, అతని గుర్రం ముందు త్రిశూలాలు ధరించి నిలబడి నడవసాగారు

వ్యూహం కోటవాకిలి చేరగానే సీతారాం స్వయంగా కోటవాకిలి తెరిచాడు. వెంటనే ముసల్మానులు ప్రవాహంలాగా కోటలోకి రాసాగారు; కాని ఎదురుగా త్రిశూలాలు ధరించిన భైరవీమూర్తులను చూడగానే వారు కొయ్యబారి నిలిచి పోయారు. జయంతి తన త్రిశూలంతో ముసల్మాను సైనికుల మధ్యగా మార్గం చేసుకుంటూ ముందుకు సాగింది వారామెకు దారి ఇచ్చారు. అలా ఏర్పడిన మార్గం గుండా సీతారాం తన సూచీవ్యూహాన్ని ముందుకు పోనిచ్చాడు.

అయితే ముసల్మానులు ఆడవాళ్ళను వదిలిపెట్టి సీతారామునూ, అతని యోధులనూ చుట్టుముట్టసాగారు. యుద్ధం చెయ్యవద్దని సీతారాం తన యోధులకు ముందే హెచ్చరించాడు. ముసల్మానులు ఒక్కొక్కణ్ణే చంపేస్తుంటే, చచ్చినవాళ్ళ స్థానా

లలో కొత్తవాళ్ళు నిలుస్తూ వచ్చారు అందుచేత వ్యూహానికి భంగం రాకుండ చాలాదూరం వెళ్ళారు.

అకస్మాత్తుగా సూచీవ్యూహం దారికి అడ్డంగా ఒక ఫిరంగి ప్రత్యక్ష మయింది రాజు తన కుటుంబంతో పారిపోతున్నా డని తెలిసి ముసల్మాను సేనాపతి ఈ ఫిరంగిని ఏర్పాటు చేయించాడు అతని దృష్టి. సైనికుల దృష్టి కోటమీద ఉన్నది దాన్ని ముందు కొల్లగొట్టాలి అందుచేత ఫిరంగిని ప్రయోగించటానికి ఒక మనిషిని ముసల్మాను సేనాపతి నియోగించాడు

శ్రీ వెళ్ళి ఆ ఫిరంగికి ఎదురుగా రొమ్ము పెట్టి నిలబడింది ఫిరంగి పేల్చేవాడు ఆమెను చూసి. జానకితాడు అవతల పారేసి. ఎడంగా నిలబడ్డాడు అప్పుడు సీతారాం అతన్ని చంపటానికి కత్తి ఎత్తి. జయంతి ఆగమంటున్నా వినిపించుకోకుండా వాడితల నరికేసి. ఫిరంగిని స్వాధీనపరుచుకున్నాడు అతను ఆ ఫిరంగినే ప్రయోగిస్తూ ముస్లిము సైనికులను చెదరగొట్టి. తన సూచీవ్యూహం సేనమధ్యనుంచి బయట పడటానికి దారి ఏర్పాటు చేసుకున్నాడు...

సీతారాం రాజ్యం పోయింది. అతను తనవారితోకూడా శత్రువులకు చిక్కకుండా బయటపడ్డాడు

ఆ సాయంకాలం శ్రీ ఏకాంతస్థలంలో జయంతిని "ఆ ఫిరంగి సైనికు డెవరు? అతన్ని మహారాజు చంపుతుంటే ఎందుకు వద్దన్నావు ?" అని అడిగింది

"అతను చచ్చేపోయాడు మహారాజు బతికేఉన్నాడు. నువు చేసినపని మంచిదే అయింది "

"అయితేమాత్రం చెప్పగూడదా ?"

"అయితే అక్కడికి వెళ్ళి చూసివద్దాం పద "

ఇద్దరూ దీపం తీసుకుని ఫిరంగిసైనికుడు చచ్చినచోటు వెతుక్కుంటూ వెళి శవాన్ని కనిపెట్టారు. అది గంగారాం శవం.

శ్రీ వెక్కి వెక్కి ఏడవసాగింది

"గంగారాం ప్రాణాలు రెండుసార్లు కాపాడావు. ఈసారి నీవల్లనే అతను చచ్చాడు నీ క్లిష్టుడైన నీ అన్న నీ చేతిలో చావాలని నీ జాతకంలోనే రాసిపెట్టి ఉన్నది ఇతనికి దహనసంస్కారం చేద్దాం," అన్నది జయంతి

ఇద్దరూ కలిసి గంగారాం కళేబరానికి దహనక్రియ జరిపి. ఆ చీగటిలోపడి ఎటో వెళ్ళిపోయారు

సీతారాం. అతనిభార్య నందా. పిల్లలూ ఏమైనారో ఎవరికీ స్పష్టంగా తెలియదు.